సాక్షి వరంగల్

శుక్రవారం । 26 ఏప్రిల్ । 2024



బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలి

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. - IIలో▸



రూ.8.42లక్షల నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. - IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం $42^0/27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి అధికంగా ఉంటుంది. రాత్రి ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

మలేరియాను నియంత్రించాలి

- అవగాహన సదస్సులో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



గీసుకొండ: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మలేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కీటక జనిత వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వ్యాధి నిర్ధారణపై ఇంటింటా సర్వే చేపట్టి సత్వర వైద్య సేవలందించాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలన్నారు. మలేరియా నిర్మూలనలో భాగంగా జిల్లాలోని 9 ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న 20 గ్రామాల్లో ముందస్తు జ్వరపీడిత సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. మలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి నీరు నిల్వ ఉండే పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. సదస్సులో డాక్టర్ కిరణ్, యశస్విని, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్, విజయేంద్రకుమార్, పాలకుర్తి సదానందం, మధుకర్, రాజశేఖర్, చక్రపాణి, కుమారస్వామి, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల్లో ఇద్దరిపై కేసు

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వరంగల్ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు అభ్యర్థులకు బదులు మరో ఇద్దరు పరీక్ష రాస్తున్న విద్యార్థినులను తనిఖీ బృందాలు గుర్తించి పోలీసు కేసు నమోదు చేసినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. మొదటి రోజు పదో తరగతికి 468 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 403 మంది, ఇంటర్ పరీక్షకు 695 మందికి 623 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు.

కిష్టాపురం చెక్‌పోస్ట్ తనిఖీ



రాయపర్తి: మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జనగామ డీసీపీ సీతారాం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తనిఖీలు చేస్తున్నప్పుడు వాహనదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై వడ్డె సందీప్‌కుమార్, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సీహెచ్.శివప్రసాద్‌రెడ్డి

ఖిలా వరంగల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సీహెచ్.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. యాసంగిలో 56 ఐకేపీ సెంటర్ల ద్వారా 5171.080 మెట్రిక్ టన్నులు, 130 పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 2583.080, మెప్మా ఒక సెంటర్ ద్వారా 283.100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. మొత్తం 189 కేంద్రాల ద్వారా 1,420 మంది రైతుల నుంచి రూ.17.7 కోట్ల విలువైన 8037.260 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.123 కోట్లు జమ చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు అవసరమున్న చోట సమకూర్చుకోవాలని, కాంటాలు అయిన వెంటనే ధాన్యాన్ని రవాణా చేయాలని నిర్వాహకులకు సూచించారు. 17శాతం లోపు తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తేవాలని కోరారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉంటే 7995050785 కాల్‌సెంటర్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్‌లో మాయాజాలం

మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వచేస్తామని అడ్తిదారుల దందా

- రైతులకు సమాచారం లేకుండానే పంట విక్రయం
- నిబంధనలకు విరుద్ధంగా రూ.4 శాతం కమీషన్ వసూలు



వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అడ్తిదారులు (కమీషన్) మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈసీజన్‌లో ఇప్పటికే మిర్చి పెద్ద మొత్తంలో మార్కెట్‌కు రావడం, కోల్డ్‌స్టోరేజీల్లో స్థలం లేకపోవడంతో ధరలను తగ్గించారు. మిర్చిని అమ్ముకుందామని వచ్చిన రైతులు మార్కెట్‌లోని ధరలను చూసి నిరాశ చెందుతున్నారు. గత వారం కంటే క్వింటాలుకు రెండు మూడు వేల రూపాయలు ధర తక్కువ ఉన్నందున కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టేందుకు రైతులు సంబంధిత అడ్తిదారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు సరే అంటూ కొంత నగదు ఇవ్వడంతో ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. కానీ, అదేరోజు అడ్తిదారులు మార్కెట్‌లో ఉన్న ధర కంటే రూ.రెండుమూడు వేలకు ఎక్కువగా ట్రేడర్లకు అమ్ముకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ధరలు పెరిగిన సమాచారం తెలిసిన రైతులు మార్కెట్‌కు వస్తే మీ సరుకులు అదేరోజు విక్రయించామని, మిగిలిన డబ్బులను తీసుకుపోవాలని అడ్తిదారులు చెప్పడంతో రైతులకు నోటిమాట రావడం లేదని తెలుస్తోంది. ఇదేంటని ప్రశ్నిస్తే కొన్ని డబ్బులు తీసుకున్న సమయంలో అమ్మితే అమ్ము లేకుంటే కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టు అన్నావని బుకాయిస్తున్నారు. కావాలంటే నీపక్కన ఉన్న ఈ రైతును అడగు అని సాక్ష్యాలను పుట్టిస్తుండడంతో ఏమి చేయలేక పోతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు.

కోల్డ్‌స్టోరేజీకి వెళ్లే దారిలోనే..

మార్కెట్ నుంచి మిర్చిని కోల్డ్‌స్టోరేజీలకు తీసుకువెళ్తున్న క్రమంలోనే అడ్తిదారులు దందాకు తెరలేపుతున్నారు. ధర తక్కువ ఉన్నందున మిర్చి విక్రయించమని రైతులు అడ్తిదారులకు చెప్పడంతో కోల్డ్‌స్టోరేజీకి తీసుకెళ్లేందుకు పాస్ రాయించుకుంటున్నారు. సరుకు మెయిన్‌గేట్ దాటగానే మరో ట్రేడర్‌కు అమ్ముతున్నారు. అడ్తిదారులు ముందుగానే ట్రేడర్లతో మిర్చికి రేటును మాట్లాడుకుని రైతులకు తక్కువ ధర పడుతుందని చెబుతున్నారు. దీంతో ఈవారం వద్దు కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టాలని రైతులు చెబుతున్నారు. సరే స్టోరేజీకి తీసుకుపోతున్నట్లు రైతులకు పట్టి ఇచ్చి బయటకు వెళ్లగానే విక్రయాలు సాగిస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల్లో స్థలం లేకపోవడంతో అమ్మకాలు తప్పలేదంటూ అడ్తిదారులు చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కమీషన్ వసూలు చేస్తూ దోపిడీ..

మార్కెట్‌లో మిర్చి అమ్మకాలు జరిపితే 2 శాతం కమీషన్‌ను మార్కెట్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అనధికారికంగా 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి అడ్తిదారులు వసూలు చేస్తున్నారు. 4 శాతం ఏమిటని అడిగితే అది అంతే అన్న సమాధానం కమీషన్‌దారుల నుంచి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. ఈ అక్రమ వసూళ్లు బహిరంగ రహస్యమే అయినా మార్కెట్ కమిటీ అధికారులు, రైతు సంఘాల నాయకులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌లో అడ్తిదారుల దందాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

దోచుకుంటున్నారు..



మార్కెట్‌లో అడ్తిదారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. శ్రీరామనవమి ముందు మార్కెట్‌కు వండర్‌హాట్ మిర్చి 51 బస్తాలు తెచ్చిన. క్వింటాలుకు రూ.8వేల ధర ఉంటే కోల్డ్‌స్టోరేజీలో పెట్టమని చెప్పి రూ.2వేలు తీసుకునిపోయా. నిన్న ఫోన్ చేస్తే సరుకు అమ్మినట్లు చెప్పిండు. అందుకే వచ్చాను. ఎందుకు అమ్మినవని ప్రశ్నిస్తే రూ.9 వేలు కట్టించాడు. దొంగ సాక్ష్యాలు చెప్పే వారిని ఏర్పాటు చేసుకుని అడ్తిదారులు రైతులను దోచుకుంటున్నారు. కమీషన్ 4 శాతం తీసుకున్నారు. ఈ బాగోతంపై అధికారులు దృష్టి పెట్టాలి.

– నామని నర్సింహులు, పలిమెల,భూపాలపల్లి

లోక్‌సభ పోరు.. మరింత హోరు...

ముగిసిన నామినేషన్ల దాఖలు ఘట్టం

- వరంగల్ లోక్‌సభకు 89.. మహబూబాబాద్‌కు 55 సెట్లు
- నేడు పరిశీలన.. 29న ఉప సంహరణ.. అదేరోజు అభ్యర్థులకు గుర్తులు
- మూడు పార్టీల మధ్యే ప్రధాన పోటీ.. అగ్రనేతల ప్రచారంపైన ఆశలు



బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కళాకారుల ప్రదర్శన

సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికల పర్వంలో నామినేషన్ల దాఖలు ఘట్టం గురువారం ముగిసింది. వరంగల్, మహబూబాబాద్ స్థానాల నుంచి మొత్తం 87మంది అభ్యర్థులు.. 144 సెట్లలో తమ నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్ లోక్‌సభకు 58 మంది అభ్యర్థులు 89 సెట్లు, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 29 మంది 55 సెట్లు వేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ రెండు స్థానాల కోసం ఆరుగురు ప్రధాన పార్టీల అభ్యర్థులు 29 సెట్లలో నామినేషన్లు వేయగా.. ఎంసీపీఐ ఎంఎల్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్), ధర్మ సమాజ్ పార్టీ, ఐహర నేషనల్ పార్టీ, విదుతలై చిరుతైగల్ కట్చి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తదితర పార్టీలతో పాటు స్వతంత్రులుగా పలువురు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అధికారులు శుక్రవారం నామినేషన్లను పరిశీలించనున్నారు. 29న ఉపసంహరణకు తుది గడువు కాగా.. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

రెండు స్థానాల్లో త్రిముఖ పోరు...

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో తాజా పరిస్థితులను బట్టి మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్యే ఈ పోటీ ఉండగా... ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచే ప్రచారాన్ని మొదలు పెట్టారు. వరంగల్ నుంచి ఆరూరి రమేశ్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్), డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్‌ఎస్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మహబూబాబాద్‌లో పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్), మాలోత్ కవిత(బీఆర్‌ఎస్), అజ్మీరా సీతారాం నాయక్(బీజేపీ) గెలుపు కోసం పోటీ పడుతున్నారు. అభ్యర్థులు ఆయా పార్టీల అగ్రనేతల ప్రచారంపై ఆశలు పెట్టుకున్నారు. 29న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రచారాన్ని హోరెత్తించడం కోసం వ్యూహాలు పన్నుతున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తరఫున ఆ పార్టీల అగ్రనేతలు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, డి.శ్రీధర్ బాబు, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీజేపీ ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్రమంత్రులు ప్రచారం నిర్వహించారు. 28న బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా వరంగల్‌లో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఈ మూడు పార్టీల అగ్రనేతల బహిరంగసభలు, రోడ్‌షోలకు ప్లాన్ చేస్తున్నారు.

తగ్గుతుందా..? పెరుగుతుందా..?

- పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతంపై చర్చ
- 2014, 2019 ఎన్నికల్లో తగ్గిన పోలింగ్ - IIలో▸
- వరంగల్, మహబూబాబాద్ ఓటర్లపై నజర్

కూలీలకు వసతులు కల్పించాలి

- డీఆర్‌డీఓ కౌసల్యాదేవి



ఖానాపురం : కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

ఖానాపురం: ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు సరైన వసతులు కల్పించాలని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. మండలంలోని బుధరావుపేటలో ఉపాధి హామీ పనులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. పనుల వద్ద తాగునీరు, నీడ లేదని కూలీలు డీఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాగునీటి కోసం ఒక్కో కూలికి రూ. 2.50 కేటాయిస్తున్నట్లు తెలిపారు. కూలీలకు ప్రతీ రోజు పనులు కల్పించాలని సూచించారు. మండలంలో ప్రస్తుతం 2700 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారని, ఈ సంఖ్యను నాలుగు వేలకు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.300 రావాలంటే ప్రతీ కూలీ రోజుకు 3 నుంచి 4 గంటలు పని చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఉపాధి పనుల వివరాలు సేకరించి, కూలీలకు సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ భారతి, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలి

నెక్కొండ: కొలతల ప్రకారం విద్యార్థుల యూనిఫాం కుట్టాలని మహిళా సమాఖ్య సభ్యులకు డీఆర్‌డీఓ కౌసల్యాదేవి సూచించారు. మండల కేంద్రంలోని నెక్కొండ భారతి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యూనిఫాం కుట్టేటప్పుడు సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏడీఆర్‌డీఓ రేణుకాదేవి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డీపీఎం భవాని, ఏపీఎం శ్రీనివాస్, ఏపీఓ జాకబ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, సీసీలు రవీందర్, ఏకాంబ్రం శారద, మాణిక్యం, వెంకట్, ట్రైనర్స్ యమున, కోకిల, వెంకటేశ్వర్లు, శ్వేత, శ్రీనివాస్ ఉన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గంలో సాగు, తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో నియోజకవర్గ రైతులు పాకాల, రంగాయచెరువు, మాదన్నపేట చెరువుల కింద వరి పంట సాగు చేశారని తెలిపారు. సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. పంటలను కాపాడేందుకు దేవాదుల ప్రాజెక్టు నుంచి రంగాయచెరువు, రంగాయ చెరువు నుంచి మాదన్నపేట చెరువులోకి కాల్వ ద్వారా 20 రోజులు నీటిని తరలించామని తెలిపారు. మాదన్నపేట చెరువుకు నాలుగు కరెంట్ మోటార్లను తెప్పించి సాగునీరందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామాలతోపాటు పట్టణంలో ప్రతిరోజు నీరందించేందుకు అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రస్తుతం పట్టణానికి మాటువీరారం నుంచి పైపులైన్ల ద్వారా నీరందించడమే కాకుండా మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని కూడా ఉపయోగిస్తున్నామన్నారు. టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య పాల్గొన్నారు.

మాదన్నపేట చెరువులో మోటార్లు ప్రారంభం



మాదన్నపేట చెరువు నుంచి మోటార్ల ద్వారా పంటపొలాలకు వెళ్తున్న నీరు

నర్సంపేట రూరల్: మాదన్నపేట చెరువు చివరి ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో పెద్ద కాల్వ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మోటార్లను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు గురువారం ప్రారంభించారు. ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య, కౌన్సిలర్ ఎలకంటి విజయ్, కాంగ్రెస్ యువ నాయకులు రతన్ కుమార్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మేర్గు సాంబయ్య, మాజీ ఎంపీటీసీ ముత్తినేని వెంకన్న, కాంగ్రెస్ మండల నాయకులు ఆదిరెడ్డి, శ్యాం, దూడెల సతీష్, జినకుల నర్సయ్య, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మే 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు

- నల్లగొండ–ఖమ్మం–వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 2న నోటిఫికేషన్ జారీ
- అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- మూడు జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు

- IIలో▸

నర్సంపేట పీఏసీఎస్ ఛైర్మన్‌గా బొబ్బాల రమణారెడ్డి



నర్సంపేట: నర్సంపేట పీఏసీఎస్ ఛైర్మన్‌గా మహేశ్వరం సొసైటీ డైరెక్టర్ బొబ్బాల రమణారెడ్డిని గురువారం ఎన్నుకున్నారు. డీసీఓ సంజీవరెడ్డి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ముత్తోజిపేట సొసైటీ డైరెక్టర్ మురాల మోహన్‌రెడ్డి ఛైర్మన్‌గా నాలుగు సంవత్సరాలు కొనసాగారు. గత మార్చి 17వ తేదీన 9 మంది సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానంపై ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఛైర్మన్‌ను ఎన్నుకోవాలని హైకోర్టు డీసీఓకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో డైరెక్టర్లు బొబ్బాల రమణారెడ్డిని చెర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. పీఏసీఎస్ ఛైర్మన్ బొబ్బాల రమణారెడ్డిని శాలువాతో సన్మానించారు.

రైతులు దళారులను నమ్మొద్దు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మైలారం, రాయపర్తి, రాగన్నగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గురువారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ శాఖ అధ్యక్షుల పాత్ర కీలకం

స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, మహిళా అధ్యక్షురాలు ఊగ మునిత, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తోపనగడ్డతండాకు చెందిన తౌనుగూరు దేవేందర్ (20)కూల్‌డ్రింక్ కోసం ద్విచక్ర వాహనంపై లింగగిరి వైపు వెళ్తున్నాడు. బోజెర్వులో వివాహానికి వెళ్లిన జీపు తిరిగి వస్తున్న క్రమంలో తోపనగడ్డతండా సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేందర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు.

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం


- నలుగురి మృతితో తల్లిదండ్రుల రోదన

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. సంఘటనా స్థలంలో అక్కడికక్కడే ముగ్గురు యువకులు మృతిచెందగా.. ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరొకరు మృతిచెందారు. రెక్కాడితే గాని డొక్కాడని నాలుగు కుటుంబాల్లో ఈ రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. యువకుల మృతితో మాకెవరు దిక్కు అని వారి తల్లిదండ్రుల రోదన చూపరులను కలచివేసింది.



పొన్నం గణేశ్ (ఫైల్)

- వర్ధన్నపేటకు చెందిన పొన్నం యాకయ్య–అనురాధకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు వివాహం చేయగా చిన్న కూతురు నిఖిలతో కలిసి అనురాధ ఉపాధి కోసం రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. కుమారుడు గణేశ్‌ను అక్కడే ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివించగా మంచి మార్కులు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం పెళ్లికి ఇల్లందకు వచ్చిన క్రమంలో గణేశ్ తన స్నేహితులతో కలిసి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.



వరుణ్‌తేజ (ఫైల్)

- మహబూబాబాద్ జిల్లా సింగారం గ్రామానికి చెందిన కాశమర్ల వెంకటేశ్ దంపతులకు వరుణ్‌తేజ్, పవన్‌తేజ్ కుమారులు ఉన్నారు. వీరిది పేద కుటుంబం. ఆలేరులో సెంచాల పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, వరుణ్‌తేజ్‌ను తన బాబాయి,పెద్దమ్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివించారు. స్నేహితుని వివాహం ఉందని ఇల్లంద గ్రామానికి వచ్చిన వరుణ్‌తేజ్ ను మృత్యువు కబళించింది.



మల్లెపాక సిద్ధు(ఫైల్)

- ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక రాజు, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు దివ్యాంగుడు కాగా కూతురు ఓ షాపులో పనిచేస్తోంది. రాజు, రజిత దినసరి కూలీలు. చిన్నకుమారుడు సిద్ధు వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివించారు. చేతికి అందివస్తాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడిలోకి వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.



రనిల్‌కుమార్ (ఫైల్)

- ఇల్లంద గ్రామానికి చెందిన పొన్నాల కుమారస్వామి–పూలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రనిల్ కుమార్ ఉన్నారు. వీరు సైతం కడు పేదరికంలో మగ్గుతున్నారు. రనిల్‌కుమార్ వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కబళించడంతో ఆ దంపతులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన డీసీపీ

రోడ్డు ప్రమాదం జరిగిన ఇల్లంద శివారును వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం గురువారం పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ గూటికి సుధారాణి

- వరంగల్ కార్పొరేషన్‌ను తన ఖాతాలో వేసుకున్న హస్తం పార్టీ!
- లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్



మేయర్ గుండు సుధారాణికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ ఖాతాలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చేరింది. బీఆర్‌ఎస్ నాయకురాలు, మేయర్ గుండు సుధారాణి పలువురు కార్పొరేటర్లతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మార్చి 3న మొదటిసారిగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సుధారాణి.. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో లోక్‌సభ ఎన్నికల సమయంలో వరంగల్ బీఆర్‌ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది.

కొద్దిరోజులుగా దూరం..

బీఆర్‌ఎస్‌ను వీడాలని నిర్ణయించుకున్న ఆమె కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల కేటీఆర్ పర్యటన, సభల్లో పాల్గొనలేదు. ఆయనకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కూడా ఆమె ఫొటో ఎక్కడ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఎట్టకేలకు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో మేయర్ పీఠం, పాలకవర్గం కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. మొత్తం 66 మంది కార్పొరేటర్లకు బీఆర్‌ఎస్ నుంచి 48 మంది, బీజేపీ నుంచి 10 మంది, కాంగ్రెస్ నుంచి నలుగురు, స్వతంత్రులు ముగ్గురు, ఏఐఎఫ్‌బీ నుంచి ఒక్కరు ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగా.. మారుతున్న సమీకరణల్లో భాగంగా పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు హస్తం పార్టీలో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ కార్పొరేటర్ల సంఖ్య 35కు చేరగా, బీఆర్‌ఎస్‌లో 21, బీజేపీలో 10 మంది ఉన్నారు. దీంతో మేయర్ పీఠానికి ఎసరు తప్పదని భావించిన సుధారాణి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

రూ.8.42లక్షల నగదు పట్టివేత



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ శాకరాశికుంటకు చెందిన బరుపట్ల అరుణ్ నుంచి రూ.3 లక్షలు, పెరుకవాడకు చెందిన అంకతి ప్రవీణ్ వద్ద రూ.1.50 లక్షలు, రాజ్‌కుమార్ అగర్వాల్ వద్ద రూ.83 వేలు, ఓ సిటీకి చెందిన వనమాల వీరభద్రం వద్ద రూ.70,700, కరీమాబాద్‌కు చెందిన సాదువుల సాంబశివరావు వద్ద రూ.60 వేలు, కట్టరి రవీందర్‌రావు వద్ద రూ.50,500, సిరిమల్ల శ్రీకాంత్ వద్ద రూ.51 వేలు, హనుమకొండకు చెందిన ఆశిష్ వద్ద రూ.77,700.. మొత్తం రూ.8,42,900 నగదును స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో మట్టెవాడ, మిల్స్ కాలనీ, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్లు టి.గోపి, పి.మల్లయ్య, ఎం.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డోర్నకల్‌లో రూ.55,500..

డోర్నకల్: డోర్నకల్ సమపంలోని అమ్మపాలెం చెక్‌పోస్టు వద్ద గురువారం సిబ్బంది రూ.55,500 నగదు పట్టుకున్నారు. ఖమ్మానికి చెందిన వినోద్‌కుమార్ చెక్‌పోస్టు మీదుగా వెళ్తుండగా సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఇందులో ఎలాంటి ఆధారం లేని రూ.55,500 నగదు లభించడంతో సీజ్ చేశారు.

బీఫారం సమర్పిస్తేనే పార్టీ గుర్తు కేటాయింపు..

కాజీపేట: ఎన్నికల సమరంలో గుర్తు కేటాయింపులో కీలక పాత్ర పోషించేది బీఫారం. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులను కొన్నిసార్లు ఊగిసలాట, ఒత్తిడికి గురిచేసి తికమక పెట్టేది కూడా బీఫారమే. ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ అభ్యర్థి అంటూ ఎన్నికల సంఘానికి ఇచ్చే ధ్రువపత్రమే బీఫారం. తొలుత ఆయా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థులను ప్రకటించి ఏఫారం అందజేస్తాయి. వారికే పార్టీ అధ్యక్షుడు బీఫారం అందజేస్తారు. ఆ బీఫారాన్ని సదరు అభ్యర్థి కాని అతడి పక్షాన పార్టీ బాధ్యతలు నిర్వహించే నాయకులుకాని నిర్ణీత సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది. బీఫారం అందిస్తే సంబంధిత పార్టీ గుర్తు కేటాయిస్తారు. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పరిగణించి మరో గుర్తు కేటాయిస్తారు. పార్టీలో టికెట్ల కోసం ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడే స్థానాల్లో బీఫారం చేతికి అందే వరకు అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురవుతుంటారని చెప్పొచ్చు.



జిమ్ చేస్తా.. ఓట్లు పడుతా..

వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్.. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌తో కలిసి గురువారం ఉదయం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ప్రచారం నిర్వహించారు. వాకర్లను కలిసి ఎంపీగా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఓపెన్ జిమ్‌లో వ్యాయాయం చేశారు. -హన్మకొండ చౌరస్తా



ఆడపడుచుల ఆటపాట..

బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ నామినేషన్ దాఖలు సందర్భంగా గురువారం నగరంలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ శ్రేణులు బోనాలు, దేవుళ్ల ప్రతిమలు ఎత్తుకుని ప్రదర్శన చేపట్టారు. ఈ సమయంలో డప్పుచప్పుళ్లతో ప్రధాన రహదారి మార్మోగింది. -సాక్షి ఫొటోగ్రాఫర్ హనుమకొండ

తగ్గుతుందా..? పెరుగుతుందా..?

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతంపై చర్చ

- 2014, 2019 ఎన్నికల్లో తగ్గిన పోలింగ్
- వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్ల ఓటర్లపై నజర్
- ఓట్లు రాబట్టేందుకు పార్టీల వారీగా నేతల కసరత్తు
- 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళిపై సమీక్ష..
- పోలింగ్ బూతుల వారీగా సమీక్షిస్తున్న ప్రధాన పార్టీలు
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు భిన్న ఫలితాలుంటాయని ప్రచారం



సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు పడరాని పాట్లు పడుతున్నాయి. ఓ వైపు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్లు, ప్రచారపర్వం.. మరోవైపు పోలింగ్ శాతం పెంచడం, అత్యధిక ఓట్లను రాబట్టుకోవడంపై ప్లానింగ్ చేస్తున్నారు. ఈసారి పోలింగ్ శాతం తగ్గుతుందా? పెరుగుతుందా? పోలింగ్ శాతం పెరిగితే ఎవరికి లాభం, ఎవరికి నష్టం? తగ్గితే ఏ పార్టీకి ప్రయోజనం..? అన్న కోణంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు లెక్కలు వేస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ఎండలు మండిపోతున్నాయి. 38 డిగ్రీల నుంచి 43 డిగ్రీలు నమోదవుతున్న పరిస్థితి. మండుటెండలో ఈసారి పోలింగ్ జరిగే అవకాశం ఉన్నందున.. పోలింగ్‌శాతం పెరిగినా, తగ్గినా.. మెజార్టీ సాధించే దిశగా పావులు కదుపుతున్నాయి.

తగ్గుతూ వస్తున్న పోలింగ్ శాతం...

సర్పంచ్, ఎంపీటీసీ తదితర స్థానిక సంస్థలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అదే విధంగా అసెంబ్లీ ఎన్నికలతో చూస్తే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ శాతం ఇంకా తగ్గుతోంది. ఒక ఎన్నికకు మరో ఎన్నికకు పోలింగ్ పడిపోతోంది.

- వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి 2014లో ఎన్నికల సందర్భంగా 15.38 లక్షలకుగాను 11,76,653 (76.52 శాతం) మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2015 ఉప ఎన్నికల్లో ఆ సంఖ్య 10,34,840కు పడిపోయి 68.50 శాతానికి తగ్గింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 16.67 లక్షల మంది ఓటర్లకు 10,61,672 (63.70 శాతం) మంది ఓట్లేశారు.
- మహబూబాబాద్ పార్లమెంట్‌కు వస్తే 2014లో 13.88 లక్షల మంది ఓటర్లలో 11,26,618 (81.21 శాతం) మంది ఓటేయగా.. 2019 ఎన్నికలకు వచ్చే సరికి 14.24 లక్షల మందికి 9,83,707 (69.06 శాతం) మంది ఓటర్లే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అంటే 2014, 2019 పార్లమెంట్ ఎన్నికలను పోల్చి చూసినప్పుడు 12.15 శాతం ఓటింగ్ తగ్గినట్లు రికార్డులు చెబుతున్నాయి.

ఎలాగైనా గెలవాలి.. ఓట్లు రాబట్టడంపై కసరత్తు..

పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనేది కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు లక్ష్యంగా పెట్టుకున్నాయి. గత ఎన్నికల్లో పోలింగ్ ట్రెండ్, శాతాలపై మల్లాగుల్లాలు పడుతున్న ఆ పార్టీ ముఖ్యనేతలు.. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ ఓటుబ్యాంకును కొల్లగొట్టే వ్యూహాల్లో మునిగి తేలుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలైన ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి 6,63,556, బీఆర్ఎస్‌కు 5,03,298, బీజేపీకి 1,56,638 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలైన ఓట్లలో కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లు, బీఆర్ఎస్‌కు 4,43,910, బీజేపీకి 34,476 ఓట్లు వచ్చాయి. మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అయితే ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో అందులో ఒకరు కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల గెలుపే లక్ష్యంగా ఓట్ల రాబట్టడంపై గురిపెట్టడం.. ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు రూపొందిస్తుండడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోలైన ఓట్లు నియోజకవర్గాలు, పార్టీల వారీగా..

అసెంబ్లీ నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ)	93,917	1,01,696	4,984
పాలకుర్తి	1,26,848	79,214	2,982
పరకాల	72,573	64,632	38,735
వరంగల్ (పశ్చిమ)	72,649	57,318	30,826
వరంగల్ (తూర్పు)	67,757	42,783	52,105
వర్ధన్నపేట(ఎస్సీ)	1,06,696	87,238	12,275
భూపాలపల్లి	1,23,116	70,417	14,731
మొత్తం	6,63,556	5,03,298	1,56,638

2023 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో పోలైన ఓట్లు నియోజకవర్గాలు, పార్టీల వారీగా..

అసెంబ్లీ నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్(ఎస్టీ)	1,15,587	62,456	1,817
మహబూబాబాద్(ఎస్టీ)	1,16,644	66,473	17,083
నర్సంపేట	1,04,185	85,296	3,062
ములుగు	1,02,267	68,567	5,388
పినపాక	90,510	56,004	2,627
ఇల్లందు	1.09,171	51,862	2,568
భద్రాచలం	47,533	53,252	1,931
మొత్తం	6,85,897	4,43,910	34,476

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మే 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 2న నోటిఫికేషన్ జారీ
- అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- మూడు జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు మే 27వ తేదీన జరుగనున్నాయి. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి డిసెంబర్ 9వ తేదీన రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తే ఆరు నెలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఎన్నికల సంఘం మార్చి వరకు ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైంది. తాజాగా ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది.

నోటిఫికేషన్ విడుదల రోజునుంచే నామినేషన్లు

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మే 2వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. అదే రోజు నుంచి మే 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఆ తరువాత 10వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. అదే రోజు అభ్యర్థుల ఫైనల్ జాబితా ప్రకటించనున్నారు. మే 27వ తేదీన ఎన్నికకు పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపడతారు.

మూడు ఉమ్మడి జిల్లాల ఓటర్లు ఇలా..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 12 కొత్త జిల్లాల పరిధిలో మొత్తం 4,61,806 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. జనవరి నెల నుంచే ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం కొత్తగా ఓటర్ల జాబితాను తయారు చేసింది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 5,05,505 ఓటర్లుండగా అందులో 3,85,996 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 76.35 శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఓటర్ల జాబితా అన్నింటిని రద్దు చేసి మళ్లీ కొత్తగా పట్టభద్రులందరి నుంచి ఓటు నమోదుకు ఎన్నికల సంఘం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో గల 12 కొత్త జిల్లాల్లో (సిద్దిపేట జిల్లాలోని ఐదు పోలింగ్ స్టేషన్ల పరిధిలోనే) ఇప్పటివరకు 4,61,806 మంది ఓటర్లు మాత్రమే ఓటును నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 2,87,007, మహిళలు 1,74,794 మంది పట్టభద్రులు ఉన్నారు. కాగా ట్రాన్స్‌జెండర్లు మరో ఐదుగురు ఉన్నారు. మొత్తం 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాల వారీగా ఓటర్లు..

జిల్లా	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్లు	మొత్తం
సిద్దిపేట	3,118	1,553	0	4,671
జనగామ	14,862	8,457	1	23,320
హనుమకొండ	25,608	17,875	0	43,483
వరంగల్	26,907	16,687	0	43,594
మహబూబాబాద్	22,842	11,917	0	34,759
ములుగు	6,558	3,679	0	10,237
భూపాలపల్లి	7,956	4,504	0	12,460
భద్రాద్రి	22,486	17,412	0	39,898
ఖమ్మం	50,517	33,085	4	83,606
భువనగిరి	20,740	13,186	0	33,926
సూర్యాపేట	34,043	17,250	0	51,293
నల్లగొండ	51,370	29,189	0	80,559
మొత్తం	2,87,007	1,74,794	5	4,61,806

ముగిసిన నామినేషన్ల దాఖలు



వరంగల్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి బాబుమోహన్



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి కృష్ణవేణి

- 58 మంది అభ్యర్థులు.. 89 నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన
- 29న తుది జాబితా

కాళోజీ సెంటర్ : లోక్‌సభ నామినేషన్ల దాఖలు పర్వం ముగిసింది. ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీ(గురువారం)తో ముగిసింది. ఈ మేరకు వరంగల్ ఎస్సీ పార్లమెంట్ (15) నియోజకవర్గానికి మొత్తం 58 మంది అభ్యర్థులు 89 నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. కాగా, గురువారం చివరి రోజు బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తన రెండో సెట నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, ఆయన తరఫున బీజేపీ నాయకులు వేర్వేరుగా మరో రెండు సెట్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ పక్షాన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పసుల రవి ఒక సెట్ నామినేషన్ పత్రం అందజేశారు. బీఎస్పీ అభ్యర్థిగా పంజా కల్పన, ఎంసీపీ(యూ) పార్టీ అభ్యర్థిగా కొత్తపల్లి సావిత్రి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు సినీ హాస్య నటుడు పల్లి బాబుమోహన్, రూప పోలేపాక, బర్ల బాబు, మోత్కుపల్లి ప్రభాకర్ ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్యకు అందజేశారు. నేడు (శుక్రవారం) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా అదే రోజు సాయంత్రం వెలువడనుంది.

మానుకోట పార్లమెంట్ స్థానానికి చివరి రోజు 9 నామినేషన్లు.. 24 సెట్లు

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి చివరి రోజు గురువారం 9 నామినేషన్లు.. 24 సెట్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లో ఆర్వో, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. తెలంగాణ జాంగిర్ పార్టీ నుంచి వి. రవికుమార్, స్వతంత్ర అభ్యర్థిగా పోరిక అశోక్, సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బుర్కా కృష్ణవేణి, బీజేపీ నుంచి డమ్మీ అభ్యర్థి జాటోత్ జమున రెండు సెట్లు, ధర్మసమాజ్ పార్టీ నుంచి ఆర్. భద్రమ్మ, స్వతంత్ర అభ్యర్థిగా డి. వెంకన్న, స్వతంత్ర (కాంగ్రెస్)లాకావత్ లక్ష్మీనారాయణ మూడు సెట్లు, బీఎస్పీ నుంచి కోనేటి సుజాత 3 సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా బోడ ప్రశాంత్ నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు నామినేషన్ వేసిన అభ్యర్థులు బీజేపీ నుంచి అజ్మీరా సీతారాంనాయక్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గుగులోత్ శేఖర్ రెండు సెట్లు, బీఆర్ఎస్ నుంచి మాలోత్ కవిత రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థి బోడ అనిల్‌కుమార్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి మైపాతి అరుణ్‌కుమార్ ఒకసెట్, స్వతంత్ర అభ్యర్థి బి ప్రేమ్‌లాల్ ఒక సెట్, గోండు వాన గణతంత్ర పార్టీ నుంచి సోయం కన్న రాజు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి జాటోత్ చక్రవర్తి ఒక సెట్ నామినేషన్ వేసినట్లు అధికారులు తెలిపారు. చివరి రోజు 24 సెట్లు దాఖలైనట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 29 మంది అభ్యర్థులు 55 సెట్లు దాఖలు చేసినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఏ ఆర్వోలు ఎం.డేవిడ్, లెనిన్ వత్సల్ టోప్పో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై అధికారులను సంప్రదించాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

కాళోజీ సెంటర్ : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు, సలహాలు, సూచనల కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల అభ్యర్థులు.. ఎన్నికల సాధారణ పరిశీలకులను సంప్రదించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఎన్నికల సాధారణ పరిశీలకుడు బండారి స్వాగత్ రణవీర్‌చంద్, (సెల్ నంబర్ 82475 24267), అలాగే ఎన్నికల పోలీసు పరిశీలకుడు నవీన్ సాయిని (సెల్ నంబర్ 98551 27500)ని సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం



దొంతుల మనీష్ | జి. నవీన్ | ఎ. నందిని | వై. సాత్విక్‌రెడ్డి, | జి. కాలు

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జేఈఈ(మెయిన్స్) ప్రవేశపరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఆర్ విద్యా సంస్థలకు చెందిన దొంతుల మనీష్ జాతీయస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 126వ ర్యాంకు సాధించారని వివరించారు. జి. నవీన్ జాతీయ స్థాయిలో రిజర్వేషన్ కేటగిరీలో 5వ ర్యాంకు, ఎ. నందిని రిజర్వేషన్ కేటగిరీలో 12వ ర్యాంకు, వై. సాత్విక్‌రెడ్డి రిజర్వేషన్ కేటగిరీలో 42వ ర్యాంకు, జి. కాలు రిజర్వేషన్ కేటగిరీలో 55వ ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే, దాసరి కార్తీక్ 131వ ర్యాంకు, జె. శ్రీతన్‌రెడ్డి 144, కె ప్రశాంత్‌రెడ్డి148, తుమ్మ తేజస్వి 149, కాసారామ్ అఖిల్ యాదవ్ 154, పి. నిహాల్ శ్రీవాత్సవ 186, కాటంగరి శ్రీరామ్‌రెడ్డి 192, తుమాటి అమృతవర్షిణి 201, కె. రమణారెడ్డి 211, టి. శ్రేష్ఠ 225, పల్ప్రమ్ రిత్విక్ 314వ ర్యాంకులు సాధించినట్లు వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. ప్రతి సంవత్సరం ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిపోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వారు పేర్కొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

- ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి



మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం

హన్మకొండ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి అన్నారు. బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ నామినేషన్ సందర్భంగా గురువారం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కోవ లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రపంచంలో భారతదేశ గౌరవం, ప్రతిష్ట పెరిగిందన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కానున్నారన్నారు. మోదీ టీమ్‌లో అరూరి రమేశ్‌ను చేర్చాలన్నారు. తెలంగాణ సంక్షేమాన్ని, వరంగల్ అభివృద్ధిని ప్రధానమంత్రి చూసుకుంటారన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కోవ లక్ష్మణ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ మైనారిటీలు, ముస్లిలంటూ విభజన చేస్తున్నారని, దేశంలోని వనరులన్నీ మైనారిటీలకు కట్టబెడుతామని కాంగ్రెస్ అంటుందన్నారు. ఓబీసీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లింలకు ఇస్తామంటున్నారని విమర్శించారు. అన్ని వర్గాల శ్రేయస్సు కోసం బీజేపీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేస్తూ, బీజేపీ రాముడి పేరును వాడుకుంటూ రాజకీయం చేస్తుందని అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కళ్లబొల్లి మాటలు చెప్పి గద్దె ఎక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మోదీకి ఓటు వేస్తామని అంటున్నారన్నారు. ఈ సారి రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుంటుందన్నారు. అభ్యర్థి అరూరి రమేశ్ మాట్లాడుతూ మడికొండ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి.. తాను (రమేశ్) విజయం సాధిస్తున్నట్లు పరోక్షంగా చెప్పారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ ప్రభారి వి.మురళీధర్ గౌడ్, కన్వీనర్ కుమారస్వామి, నాయకులు గరికపాటి మోహన్ రావు, సురేష్ రెడ్డి, వన్నాల శ్రీరాములు, డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, చాడ స్వాతి, మహేందర్ రెడ్డి, రావుల కోమల, కిషన్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలి

- సదస్సులో పలువురి వక్తల పిలుపు



నినాదాలు చేస్తున్న అతిథులు

హన్మకొండ: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ వెంగల్ రెడ్డి అధ్యక్షతన 'ప్రజాస్వామ్య పరిరక్షణ - పౌర సమాజ బాధ్యతలు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, న్యాయవాది కిరణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు పి.ప్రసాద్, సామాజిక విశ్లేషకుడు సీఎస్ఆర్ ప్రసాద్, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు కన్నెగంటి రవి ప్రసంగించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి గద్దెనెక్కిన బీజేపీ నోట్ల రద్దు, ప్రైవేటీకరణతో ఉన్న ఉద్యోగాల్లో 12 కోట్ల ఉద్యోగాలను పోగొట్టారని, గత పదేండ్ల పాలనలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని విమర్శించారు. ఆధిపత్య కులాల సంపదకు మతాన్ని జోడించి ప్రజలను అన్ని విధాలా అణచివేస్తూ పాలన కొనసాగిస్తున్న బీజేపీ ఫాసిజాన్ని అర్థం చేసుకుని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదుసర్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, లాల్ నీల్ మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ మార్క శంకర్ నారాయణ, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర నాయకురాలు బి.రమాదేవి, ఆయా సంఘాలు, పార్టీల నాయకులు నున్న అప్పారావు, జైసింగ్ రాథోడ్, ఎండి. రాజ్ మహ్మద్, సోమయ్య, ఓం బ్రహ్మం, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, దొమ్మాటి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫ్యాషన్







పార్టీ వేర్ అనగానే ముందుగా మనకు
ఫాస్ట్ ఫ్యాషన్ గుర్తుకు వస్తుంది.
కానీ, వేసవి వేడికి భరించలేం అనే ఆలోచన
వచ్చిన వెంటనే ఎక్కడలేని నీరసం వచ్చేస్తుంది.
సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్‌తో పార్టీవేర్‌ను రెడీ చేసుకుంటే..
మరీ సంప్రదాయ బద్ధంగా ఉంటాం
అనుకునే నవతరపు ఆలోచనను దృష్టిలో పెట్టుకొని
రెట్రో లుక్‌తో ఏ సీజన్‌కైనా స్టైలిష్ లుక్‌తో మెరిసిపోయేలా
మల్ చందేరీ, పట్టు, ఫ్లోరల్ కాంబినేషన్స్‌తో చేసిన డిజైన్స్ ఇవి.

సీజనల్ స్టైల్





రెట్రో గులాబీ

చేనేతల నుంచి ఎంచుకున్న ప్లెయిన్ మల్ చందేరీ, పట్టుతో డిజైన్ చేసిన డ్రెస్సులు ఇవి. నవతరానికి పాత కాన్సెప్ట్స్‌లో ఉన్న అందాన్ని పరిచయం చేయాలనుకున్నాను. రెట్రో లుక్ వచ్చేలా లాంగ్ అండ్ పఫ్ స్లీవ్స్ డిజైన్ చేశాను. పువ్వులు, పక్షులలో జామెట్రికల్ లైన్స్ వచ్చేలా, తక్కువ ఎంబ్రాయిడరీతో వీటిని తీర్చిదిద్దాను. టీన్స్‌ని ఆకట్టుకునేలా బ్రైట్ కలర్స్‌ని ఎంచుకున్నాను. సమ్మర్‌కి ప్రత్యేక కలెక్షన్ తీసుకురావాలని చేసిన ప్రయత్నం ఇది.

– హేమంత్ సిరి,
ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్





ఈ డిజైన్స్ అన్నీ రెట్రో కాన్సెప్ట్ నుండి ప్రేరణ పొంది తయారు చేసినవే. రెట్రో ఫ్యాషన్ అనేది ఒక మాయా టైమ్ మెషిన్ లాంటిది. గడిచిన కాలాన్ని జ్ఞాపకంగా మళ్లీ మళ్లీ కళ్లముందు నిలుపుతుంది. ఏ కాలంలోనైనా కాలాతీతమైన డిజైన్స్ కొన్ని ఉంటాయి. ఫ్లోరల్ డిజైన్స్ వందల కాలాల నుంచి తమ హంగును కొత్తగా చూపుతూనే ఉన్నాయి. ప్రకృతిలో గల గొప్పతనం అదే అని ప్రతిసారీ నిరూపిస్తూనే ఉంటాయి.

**కారణాలు, సాకులు విజయానికి విరోధులు.
లక్ష్యం ఉన్నవారు ఆకాశాన్ని, పాతాళాన్ని ఏకం చేసి అనుకున్నది సాధిస్తారు.
12వ ఏట కుడి చేతిని కోల్పోయిన పార్వతి గోపకుమార్
సివిల్స్ 2023లో 282వ ర్యాంక్ సాధించడానికి ఒంటి చేత్తో పోరాడింది.
'మీరు సంతోషంగా ఉంటేనే సరిగ్గా చదవగలరు' అంటున్న
పార్వతి సమస్యలను జయించగల చిరునవ్వును సొంతం చేసుకుంది.**

ఒంటి చేత్తో విజయం

విజేత



కృత్రిమ కుడిచేయి అమర్చుకున్న పార్వతి గోపకుమార్

పార్వతి గోపకుమార్ సంతోషంగా ఉంది. ఆమెకు కలెక్టర్ కావాలని ఉంది. సివిల్స్ 2023 ఫలితాలలో 282 ర్యాంక్ సాధించింది. కాని ఆ ర్యాంక్‌కు ఐ.ఎ.ఎస్. రాకపోవచ్చు. కాని దివ్యాంగ కోటాలో చూసినప్పుడు ఆమెది టాప్ ర్యాంక్. కనుక రావచ్చు.

'మాది అలెప్పి. బెంగళూరు నేషనల్ లా స్కూల్‌లో చదువుకున్నాను. ఆ సమయంలో అలెప్పి కలెక్టరేట్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో నాటి కలెక్టర్ ఎస్.సుహాస్ పనిచేసే విధానం, కలెక్టర్ స్థానంలో ఉంటే ప్రజలకు చేయదగ్గ సేవ చూసి నాక్కూడా ఐ.ఏ.ఎస్. కావాలనిపించింది. ఆ విషయం తెలిశాక కలెక్టరేట్‌లో అందరూ నన్ను అందుకు కష్టపడమని ప్రోత్సహించారు. 2022లో మొదటిసారి సివిల్స్ రాసినప్పుడు ప్రిలిమ్స్ దాటలేకపోయాను. ఒక సంవత్సరం విరామం ఇచ్చి 2023లో రెండోసారి రాశాక ఈ ర్యాంక్ తెచ్చుకున్నాను' అని తెలిపింది పార్వతి. ఇప్పుడు ఆమె వయసు 26 సంవత్సరాలు.

7వ తరగతిలో ప్రమాదం

2010లో పార్వతి ఏడవ తరగతిలో ఉండగా కారు ప్రమాదంలో ఆమె కుడిచేయి మోచేతి వరకు కోల్పోవాల్సి వచ్చింది. ఆ వయసులో అలాంటి నష్టం ఎవరికైనా పెద్ద దెబ్బగా ఉంటుంది. అయితే తండ్రి గోపకుమార్, తల్లి శ్రీకళ ఇచ్చిన ధైర్యంతో వెంటనే ఎడమ చేత్తో రాయడం ప్రాక్టీసు చేసింది పార్వతి. ఆ తర్వాత మూడు నెలల్లో వచ్చిన పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంది. ఆ తర్వాత కొన్నేళ్లకు సిలికాన్, ప్లాస్టిక్‌లతో చేసిన కృత్రిమ హస్తాన్ని అమర్చుకుంది. 'నాకు దివ్యాంగులు అనే పదం నచ్చదు. అందులో ఏదో బుజ్జగింపు ఉంటుంది. వికలాంగులను వికలాంగులుగానే పిలుస్తూ సమాన గౌరవం ఇవ్వాలి. చేయి కోల్పోయాక నా జీవితమే మారిపోయింది. జనం వికలాంగులతో ఎంతో మొరటుగా వ్యవహరిస్తారు. నువ్వు బ్రా ఎలా వేసుకుంటావు, ప్యాడ్ ఎలా పెట్టుకుంటావు అని అడిగినవారు కూడా ఉన్నారు' అని చెబుతుంది పార్వతి.

మహిళా దివ్యాంగుల కోసం

ఐ.ఏ.ఎస్ అయ్యాక దివ్యాంగుల కోసం, ముఖ్యంగా మహిళా దివ్యాంగుల కోసం పని చేయాలనుకుంటోంది పార్వతి. 'ప్రేమలో పడి శారీరక వాంఛను వ్యక్తం చేసే దివ్యాంగుల సినిమాలు మీరెప్పుడైనా చూశారా? దివ్యాంగులకు ప్రేమ ఏమిటి అనే ధోరణి మనది. ఇక మహిళా దివ్యాంగులైతే పెళ్లి చేసుకుని భర్త ఎదుట ఆత్మన్యూనతతో ఉండేలా తయారు చేశారు. శారీరక లోపం శరీరానికి సంబంధించింది. మేము పొందాల్సిన ప్రేమ, గౌరవం, లైంగిక జీవితం పట్ల మాకు సమాన హక్కు ఉంది. కొందరు అబ్బాయిలు మమ్మల్ని ప్రేమించి ఉద్ధరిస్తున్నామనుకుంటారు. ఇందులో ఉద్ధరణ ఏమీ లేదు. మేము కూడా సమాన మనుషులమే. అందరిలాగే మేము కూడా' అంటోందామె.

బ్యూటిప్స్

మీకు తెలుసా! / కాఫీ మేలు చేస్తుంది!

తీవ్రమైన ఎండలకు చర్మం కమిలి నల్లబడిపోతుంది. నల్లబడిన చర్మం తిరిగి కాంతిమంతం కావాలంటే ఇంట్లోనే చేసుకోగలిగిన చిట్కాలు.

కాఫీ- హనీ ఫేస్ మాస్క్

మీది నార్మల్ స్కిన్ అయితే... ఒక టేబుల్ స్పూన్ కాఫీ పొడి(ఇన్‌స్టంట్ పౌడర్ కాదు. ఫిల్టర్‌లో వేసే కాఫీ పౌడర్)లో అంతే మోతాదు తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి వేళ్లతో వలయాకారంగా మర్దన చేసి ఇరవై నిమిషాల సేపు అలాగే ఉంచాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.

కాఫీ - మిల్క్ ఫేస్ మాస్క్

మీది డ్రై స్కిన్ అయితే... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల పాలు కలపాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి.

కాఫీ- టర్మరిక్- యోగర్ట్ మాస్క్

మీ ముఖం మీద మొటిమలు ఉంటే ... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో టీ స్పూన్ పసుపు, టేబుల్ స్పూన్ పెరుగు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత ఐదు నిమిషాల సేపు మెల్లగా వలయాకారంగా మర్దన చేసి ఆ తర్వాత వేడి నీటితో శుభ్రం చేయాలి.



కాఫీ - లెమన్ మాస్క్

మీది జిడ్డు చర్మం అయితే... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల సేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.

ఈ ప్యాక్‌లు ట్యాన్‌ను తగ్గించడంతోపాటు చర్మరంధ్రాలను శుభ్రం చేస్తాయి కాబట్టి ఈ ప్యాక్‌లు వేసిన తర్వాత ముఖానికి క్లెన్సింగ్ అవసరం ఉండదు.

వంటిల్లు

వడియాలే... కొంచెం కొత్తగా!

**ఎప్పుడూ అవే వడియాలా?
బోర్ అనే మాట రాకముందే మార్చేద్దాం.
పుల్లపుల్లగా తమిళ కిల్లు వతాల్.
మళయాల ఇడియాప్పం ఫ్రైయూమ్.
కన్నడ అవలక్కి...అరలు సుందిగె.
ఎండ పని పట్టి కొత్త మెనూ రాద్దాం.**

కిల్లు వత్తల్



కావలసినవి: ఉప్పుడు బియ్యం – కేజీ; సగ్గుబియ్యం– 100 గ్రాములు; జీలకర్ర – టేబుల్ స్పూన్; ఇంగువ– అర టీ స్పూన్; నిమ్మకాయలు– 2 (పెద్దవి); పచ్చిమిర్చి – 6 (మెత్తగా గ్రైండ్ చేయాలి); ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి;

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. మిక్సీలో వేసి తగినంత నీటిని చేరుస్తూ మెత్తగా పిండి చేసుకోవాలి. ఆ పిండిని ఒక మందపాటి పాత్రలో పోయాలి. అందులో సగ్గు బియ్యం, ఇంగువ, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు వేసి, మూడు లీటర్ల నీటిని పోసి కలపాలి. ఆ పాత్రను స్టవ్ మీద పెట్టి బియ్యప్పిండి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత స్టవ్ ఆపేసి పిండిలో జీలకర్ర వేసి కలిపి మూతపెట్టాలి. ఓ గంట సేపటికి పిండి వేడి తగ్గిపోతుంది. అప్పుడు మూత తీసి పిండిలో నిమ్మరసం వేసి గరిటెతో కలపాలి. ఇప్పుడు ఎండలో నూలు వస్త్రం లేదా పాలిథిన్ షీట్ పరిచి బియ్యప్పిండి మిశ్రమాన్ని చేత్తో వడియాల్లా పెట్టుకోవాలి. ఈ మిశ్రమం గరిటెతో వడియాలు పెట్టడానికి వీలుగా ఉండదు. చేత్తో తీసుకుని వేళ్లతో చిన్న నిమ్మకాయంత పిండిని వడియాల్లా వేయాలి. ఇవి ఒక రోజులోనే ఎండిపోతాయి. సాయంత్రం వలుచుకోవచ్చు. క్లాత్ మీద పెట్టినట్లయితే వెనుకవైపు నీటిని చల్లి వలవాలి. ఇది తమిళ వడియం.


అవలక్కి సుందిగే (పోహా వడియం)



కావలసినవి: అటుకులు – కేజీ; పచ్చిమిర్చి తరుగు – 50 గ్రాములు; ఉల్లిపాయ తరుగు – పావు కేజీ; ఉప్పు – 50 గ్రాములు; కొత్తిమీర తరుగు – 100 గ్రాములు; నీరు – 2 లీటర్లు; నూనె – వేయించడానికి తగినంత;

తయారీ: ● వెడల్పు పాత్రలో నీటిని తీసుకుని అందులో ఉప్పు వేసి కలపాలి. ఆ తర్వాత అటుకులు వేయాలి. అటుకులు మునిగేటట్లు ఒకసారి మెల్లగా చేత్తో అద్ది రెండు–మూడు నిమిషాల తర్వాత నీటిని వంపేసి అటుకులను జల్లెడ వంటి పాత్రలో వేసి అరగంట సేపు పక్కన ఉంచాలి. ● ఇప్పుడు అటుకులను ఒక పాత్రలో వేసి అందులో కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి పొడవాటి గరిటెతో సున్నితంగా కలపాలి. ● నూలు వస్త్రాన్ని తడిపి ఎండలో పరిచి, అటుకుల మిశ్రమాన్ని చిన్న నిమ్మకాయంత తీసుకుని వలయాకారంగా వత్తి నూలు వస్త్రం మీద పెట్టాలి. ఇలాగే అటుకుల మిశ్రమం మొత్తాన్ని చేసుకోవాలి. వస్త్రం మీద పెట్టడం కుదరకపోతే వడియాలను నీడలో కూర్చుని వెడల్పాటి ప్లేట్‌లో అమర్చి ఆ ప్లేట్‌ని పెట్టుకోవచ్చు. పై కొలతలతో దాదాపు వంద వడియాలు చేయవచ్చు. ● ఈ వడియాలను రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. ఒక వైపు ఎండిన తర్వాత వలిచి రెండవ వైపు కూడా ఎండబెట్టాలి. గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే ఏడాది పాటు తాజాగా ఉంటాయి. ● బాణలిలో నూనె వేడి చేసి ఈ వడియాలను వేసి మీడియం మంట మీద రెండు వైపులా కాలనివ్వాలి. ఇవి బియ్యప్పిండి వడియాలు వేగినంత వేగంగా వేగవు. కొంత ఎక్కువ సమయం తీసుకుంటాయి.

అరలు సుందిగె



కావలసినవి: బొరుగులు – 10 కప్పులు; సగ్గుబియ్యం– అర కప్పు; బూడిద గుమ్మడికాయ ముక్కలు – కప్పు (చెక్కు, గింజలు తీసి ముక్కలు చేయాలి); పచ్చిమిర్చి – 4 (పేస్ట్ చేయాలి); కొత్తిమీర తరుగు – కప్పు; జీలకర్ర – అర టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ:

- సగ్గుబియ్యాన్ని ఉడికించి అదనంగా ఉన్న నీటిని వడపోయాలి.
- వెడల్పుగా ఉన్న పళ్లేనికి నూనె రాసి సిద్ధంగా ఉంచాలి.
- వెడల్పాటి పాత్రలో సగ్గుబియ్యం, గుమ్మడికాయ ముక్కలు, పచ్చిమిర్చి పేస్టు, కొత్తిమీర, ఇంగువ, ఉప్పు వేసి కలపాలి.
- మరొక పాత్రలో బొరుగులు వేసి అవి మునిగేటట్లు నీటిని పోయాలి. వెంటనే బొరుగులను చేత్తో తీసి నీటిని పిండేసి సగ్గుబియ్యం, బూడిద గుమ్మడికాయ మిశ్రమం ఉన్న పాత్రలో వేసి (బొరుగులు ఎక్కువసేపు నానకూడదు) కలపాలి. వడియాల మిశ్రమం రెడీ.
- ఇప్పుడు కొద్దిగా మిశ్రమాన్ని చేతికి తీసుకుని వేళ్లతో వత్తి పాలిథిన్ షీట్ మీద అమర్చాలి. వడల్లా చేసుకోవచ్చు లేదా పిరమిడ్ ఆకారంలో వత్తుకుని ఎండలో పెట్టాలి. వీటిని మూడు రోజులపాటు ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత నిల్వ చేసుకుంటే ఆరు నెలల పాటు తాజాగా ఉంటాయి.
- బాణలిలో నూనె వేడి చేసి ఐదారు వడియాలను ఒకేసారి వేయించవచ్చు. వేయించేటప్పుడు లోపల కాలేటట్లు జాగ్రత్త తీసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత వడియాలను వేసి మంట మీడియంలో పెట్టి వడియాలను చిల్లుల గరిటెతో నూనెలోకి ముంచి కాలనివ్వాలి. దోరగా కాలిన తర్వాత తీసేయాలి. అరలు సుందిగె అంటే బొరుగుల వడియాలు. కన్నడంలో అరలు అంటే బొరుగులు.

ఇడియాప్పం ఫ్రైయూమ్స్



కావలసినవి: బియ్యప్పిండి– కేజీ; సగ్గుబియ్యం పిండి– పావు కేజీ; నీరు – 2 లీటర్లు; ఇంగువ – టీ స్పూన్; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● బియ్యప్పిండి, సగ్గుబియ్యం పిండి రెడీమేడ్ కొనుక్కోవచ్చు లేదా సొంతంగా ఇంట్లోనే చేసుకోవచ్చు. బియ్యాన్ని కడిగి నూలు వస్త్రం మీద నీడలో ఆరబోయాలి. సగ్గుబియ్యాన్ని ఓ అరగంట సేపు ఎండలో పెట్టాలి. బియ్యం ఆరిన తర్వాత బియ్యం, సగ్గుబియ్యం రెండింటినీ కలిపి మిక్సీలో లేదా వేసి మెత్తగా పొడి చేయాలి లేదా మర పట్టించవచ్చు. ● ఇప్పుడు స్టవ్ మీద వెడల్పు బాణలి పెట్టి నీటిని పోసి వేడి చేయాలి. అందులో ఉప్పు, ఇంగువ వేయాలి. నీరు మరిగేటప్పుడు మంట తగ్గించి బియ్యం, సగ్గుబియ్యం పిండిని వేసి ఉండ కట్టకుండా గరిటెతో కలపాలి. నీరు ఆవిరై పోయి పిండి మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత మంట ఆపేయాలి. మిశ్రమం పైన ఒక స్పూన్ నూనె వేసి పరిచినట్లు సర్ది మూత పెట్టాలి. మిశ్రమం వేడి తగ్గిన తర్వాత ఇడియాప్పం ఆకారంలో వత్తి ఎండబెట్టాలి.

● మురుకులు వత్తే గొట్టంలో పిండిని పెట్టి పాలిథిన్ షీట్ లేదా తడిపిన నూలు వస్త్రం మీద మురుకుల్లాగా వత్తాలి. పిండినంతటినీ ఇలాగే వత్తి రెండు రోజుల పాటు ఎండనివ్వాలి. ఒకరోజు ఎండిన తర్వాత సున్నితంగా ఒలిచి తిరగేసి రోజంతా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేయాలి.

● వేయించేటప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఒక్కో ఇడియాప్పాన్ని వేస్తూ రెండు వైపులా దోరగా వేయించి తీయాలి.

● ఆర్ట్ అండ్ కల్చర్

వేరబుల్ ఆర్ట్


● కనికా అదానీ

ముంబైకి చెందిన కనికా అదానీ 'ది స్టూడియో ప్రాజెక్ట్' ద్వారా బ్యాగ్‌లు, పాస్‌పోర్ట్ కవర్‌లు, సూట్‌కేస్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్‌లకు క్రియేటివ్ ట్విస్ట్ ఇస్తోంది. ఫ్రెండ్ పుట్టినరోజును దృష్టిలో పెట్టుకొని ఆమె షూస్‌ను పెయింట్ చేసి స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తే మంచి స్పందన వచ్చింది.

'వేరబుల్ ఆర్ట్'పై కనిక ఆసక్తి అంతకంతకూ పెరుగుతూపోయి వృత్తిగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు.

చిన్నప్పటి నుంచి బొమ్మలు వేసేది కనిక. ఆ ఇష్టమే చికాగోలోని 'ది స్కూల్ ఆఫ్ ది ఆర్ట్ ఇనిస్టిట్యూట్'లో నాలుగు-సంవత్సరాల విజువల్ ఆర్ట్స్ కోర్సు చేసేలా చేసింది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో పెయింటింగ్, గ్లాస్ బ్లోవింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఫిగర్ డ్రాయింగ్‌లాంటి ఎన్నో ఆర్ట్స్ నేర్చుకుంది. దీంతో పాటు 'పెయింటింగ్ అనేది కాన్వాస్ మీదే చేయనక్కర్లేదు' అనే విలువైన సత్యాన్ని తెలుసుకుంది

మన దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఫుల్-టైమ్ జాబ్ చేసింది. ఆ తరువాత సొంతంగా ఏదైనా చేయాలని ఆలోచన చేసింది. ఆ సమయంలోనే 'పర్సనలైజేషన్' అనే ఐడియా కనిక మదిలో మెదిలింది.

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో 'పర్సనలైజేషన్' కాన్సెప్ట్ ఉంది. మన దేశంలో పెద్దగా లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ది స్టూడియో ప్రాజెక్ట్'కు శ్రీకారం చుట్టింది. మొదట్లో కాన్వాస్ షూస్‌లాంటి ఫన్ ప్రాజెక్ట్స్ చేసింది.

ఇప్పుడు క్లయింట్స్ పర్సనల్ హై-ఎండ్ లగ్జరీ ప్రాడక్ట్‌లకు డిజైన్ చేస్తోంది. బ్రాండ్ కొలబ్రేషన్స్‌తో బిజీబిజీగా ఉంది. తన క్లయింట్స్‌లో సెలబ్రిటీలు కూడా ఉన్నారు. ప్రాడక్ట్ విభాగంలో కనిక పెయింట్ చేసిన ట్రావెల్ బ్యాగ్స్, పాస్‌పోర్ట్ కవర్స్ బాగా పాపులర్ అయ్యాయి.

● సక్సెస్ స్టోరీ

అక్షరశిల్పి

వివిధ భారతీయ భాషలకు సంబంధించి హై-క్వాలిటీ ఫాంట్స్‌ను డిజైన్ చేయాలనే లక్ష్యంతో అహ్మదాబాద్ కేంద్రంగా సత్య రాజ్‌పురోహిత్ ఇండియన్ టైప్ ఫౌండ్రీ (ఐటీఎఫ్) అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు. ఈ స్టార్టప్ యాపిల్, గూగుల్, అమెజాన్....మొదలైన పెద్ద కంపెనీలకు భారతీయ భాషలకు సంబంధించిన ఫాంట్స్ డిజైన్ చేస్తోంది....



స్కూల్‌రోజుల్లో 'అందమైన చేతిరాత'కు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవాడు సత్య. ఫ్రెండ్స్ నోట్స్‌కు హైడ్‌లైన్‌ల నుంచి తరగతి గదిలోని గోడలపై నీతివాక్యాలు రాయడం వరకు అందమైన చేతిరాతకు అందరికీ గుర్తుకు వచ్చే పేరు...సత్య రాజ్‌పురోహిత్. కార్లు, బైకుల రేడియం నంబర్ ప్లేట్స్ కోసం సత్య దగ్గరికి ఎంతోమంది వచ్చేవాళ్లు.

అక్షరాలను అందంగా రాసే నైపుణ్యం అతడిని ఎక్కడికో తీసుకెళ్లింది.

ఐటీఎఫ్(ఇండియన్ టైప్ ఫౌండ్రీ) ఒకే ఒక ఫాంట్ (హిందీ)తో స్టార్ట్ అయింది. ఆ తరువాత 450 ఫాంట్‌ల వరకు విస్తరించింది. కోహినూర్, అఖండ్, పాపిన్స్, టెకో....మొదలైన ఫాంట్స్ బాగా పాపులర్ అయ్యాయి. 'ఐటీఎఫ్' క్లయింట్స్‌లో యాపిల్, గూగుల్, అమెజాన్, సోనీలాంటి ఎన్నో పెద్ద కంపెనీలు ఉన్నాయి.

థాయి, గ్రీక్, హిబ్రూ, కొరియన్‌లాంటి నాన్-ఇండియన్ లాంగ్వేజెస్‌కు సంబంధించిన ఫాంట్స్‌ను కూడా డిజైన్ చేస్తోంది కంపెనీ.

'ప్రపంచ భాషలతో పోల్చితే భారతీయ భాషలకు ఫాంట్స్ క్రియేట్ చేయడం సవాలుతో కూడిన పని' అంటున్న సత్య ఫాంట్స్ నాణ్యత విషయంలో విజయం సాధించాడు. అదే అతడి 'యూఎస్పీ'గా మారింది.

తల్లిదండ్రులు సత్యను డాక్టర్ చేయాలనుకున్నారు. కోచింగ్ కోసం రాజస్థాన్‌లోని కోటలో రెండు సంవత్సరాలు గడిపాడు సత్య. తల్లిదండ్రుల కలను నేరవేర్చడంలో విఫలం అయ్యాడు. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఆర్ట్‌ను కెరీర్‌గా చేసుకొని విజయం సాధించాలనుకున్నాడు. చండీగఢ్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్, అహ్మదాబాద్‌లో చదువుకున్నాడు.

'కోటలో రెండు సంవత్సరాల కాలాన్ని వృథా చేసుకున్నాను. చదువులో గుడ్‌స్టూడెంట్‌ని కాదు. నాకు ఆర్ట్ అంటే ఇష్టం. నాకు ఇష్టమైన రంగంలో కష్టపడితే కచ్చితంగా విజయం సాధిస్తాను అనుకున్నాను' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు సత్య. అతడి నమ్మకం వృథా పోలేదు. సత్య పురోహిత్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు వచ్చాయి. ప్రపంచంలోని లీడింగ్ టైప్ ఫౌండ్రీలలో 'ఐటీఎఫ్' ఒకటిగా గుర్తింపు పొందింది. జీక్యూ ఇండియా '50 మోస్ట్ ఇనిష్లుయెన్షల్ యంగ్ ఇండియన్స్' జాబితాలో చోటు సాధించిన సత్య రాజ్ పురోహిత్ యువతకు ఇచ్చే సందేశం....'ప్రతి ఒక్కరిలో టాలెంట్ ఉంటుంది. ఆ టాలెంట్ ఏమిటి? అనే దాని విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. తనలోని టాలెంట్ ఏమిటో తెలుసుకొని ఇష్టంగా కష్టపడితే విజయం సాధించడం కష్టమేమీ కాదు'


● టెక్... టాక్

షావోమీ స్మార్ట్ బ్యాండ్ 8 ప్రో




డిస్‌ప్లే: 1.74 అంగుళాలు
రిజల్యూషన్: 336X480 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్
అడ్జస్టబుల్ లెంత్: 130-205 ఎంఎం
ఫీచర్స్: హార్ట్ రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మానిటర్, స్లీప్ ట్రాకింగ్, స్పోర్ట్స్ ట్రాకింగ్.... మొదలైనవి.
బ్యాటరీ: 289 ఎంఏహెచ్
కలర్స్: బ్లాక్, లైట్ గ్రే

సీఎంఎఫ్ నెక్‌బ్యాండ్ ప్రో



- టైప్: వైర్‌లెస్
- కనెక్టివిటీ: బ్లూటూత్
- వాయిస్ అసిస్టెంట్
- యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్
- బ్యాటరీ కెపాసిటీ: 220 ఎంఏహెచ్
- బరువు: 29 గ్రా.
- డైమెన్షన్స్: 937X13.2X22.8 ఎంఎం



'బ్రేవ్'లో ఆన్సర్ విత్ ఏఐ ఫీచర్

సెర్చ్ ఇంజిన్ 'బ్రేవ్' 'ఆన్సర్ విత్ ఏఐ' ఫీచర్‌ను ఎనౌన్స్ చేసింది. మల్టిపుల్ సోర్స్ నుంచి ఇన్‌ఫర్మేషన్‌ను తీసుకొని దాన్ని సింథసైజ్ చేసి యూజర్ అడిగే ఏ ప్రశ్నకైనా జవాబును స్పష్టంగా అర్థమయ్యే ఫార్మట్‌లో చెబుతుంది. వివిధ సందేహాలకు జవాబు ఇవ్వడంతో పాటు ఒక అంశానికి సంబంధించి సారాంశాన్ని, ముఖ్య అంశాలను వ్యాసం రూపంలో అందిస్తుంది.



పొయెట్రీ కెమెరా

నార్మల్ పోలరాయిడ్ కెమెరాలా కనిపించే ఈ పొయెట్రీ కెమెరా ఫోటోలు తీయడమే కాదు అందమైన ఫోటోలకు పొయెమ్స్ రాయగలదు. కెలిన్ కరోలిన్, రెయాన్‌లు ఈ ఏఐ-పవర్డ్ కెమెరాను తయారుచేశారు. హైకూ నుంచి సానెట్ వరకు రకరకాల పొయెమ్ ఫామ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. టెక్నాలజీని ఆర్ట్‌తో మిక్స్ చేసి తయారుచేసిన కెమెరా ఇది. ఇప్పటి ఇన్‌స్టాగ్రామ్ కల్చర్‌కి బాగా సరిపోతుంది.

ఫొటోలు మౌనాన్ని వీడేలా...



ఫొటోలు మౌనంగా మనల్ని చూస్తుంటాయి. మౌనాన్ని వీడి వాటితో మాట్లాడించాలని, పాడించాలని ఉందా? అయితే ఈ ఏఐ యాప్ మీ కోసమే. మైక్రోసాఫ్ట్ ఏఐ యాప్ వస-1 పిక్చర్‌లోని ఫేస్‌లతో మాట్లాడిస్తుంది. పాడిస్తుంది. మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ ఏషియా బృందం ఈ ఏఐ అప్లికేషన్‌ను క్రియేట్ చేసింది.

● అవును... ఇది నిజమే!



- యులన్ మాగ్నోలియస్ పువ్వులు అచ్చంగా పక్షుల్లా ఉంటాయి
- కోపాన్ని తగ్గించుకోవడానికి జపాన్‌లోని నగొయ యూనివర్శిటీ పరిశోధకులు ఒక టెక్నిక్‌ను డెవలప్ చేశారు. దీని ప్రకారం మనకు బాగా కోపం వచ్చినప్పుడు మనసులోని ఫీలింగ్స్‌ను కాగితంపై రాసి దూరంగా విసిరేయాలి.

● మ్యూజిక్ వరల్డ్

బిల్‌బోర్డ్ నెంబర్ 1 సాంగ్.... టూ స్వీట్



ఐరిష్ సింగర్-సాంగ్ రైటర్ హోజైర్ ఆల్బమ్ 'అన్ హార్డ్'లోని 'టూ స్వీట్' సాంగ్ 'బిల్‌బోర్డ్ హాట్ 100'లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ శుభసందర్భంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు కృతజ్ఞతలు తెలియచేశాడు హోజైర్.

'ఈ పాట ఎందుకు ఇంత పెద్ద హిట్ అయింది?' అనే ఆసక్తి మీలో ఉంటే- 'ఇట్ కాంట్ బి సెడ్ ఐయామ్ యాన్ ఎర్లీ బర్డ్ /ఇట్స్ టెనో క్లాక్ బిఫోర్ ఐ సే ఏ వర్డ్.

బేబీ, ఐ కెన్ నెవర్ టెల్ /హౌ డూ యూ స్లీప్ సో వెల్?' చరణాలతో మొదలయ్యే 'టు స్వీట్' పాటను తక్షణం వినాల్సిందే.

● గేమింగ్

సముద్రపు దొంగల ఆట కట్టించేలా....

యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'సీ ఆఫ్ థీవ్స్' ఈ నెల 30న విడుదల అవుతుంది. యూకేకి చెందిన డెవలపర్ 'రేర్' నుంచి వచ్చిన గేమ్ ఇది. రక్తపిశాచులు, రాక్షస బల్లులలాంటి రకరకాల సెట్టింగ్స్‌ను గేమ్‌లో ప్రవేశపెట్టారు. గేమ్ ప్రారంభంలో ప్లేయర్ తన జెనరేటెడ్ అవతార్‌ను సెలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. పైరేట్ థీమ్ ప్రత్యేకత ఏమిటంటే...ప్లేయర్స్‌కు తమకు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఉంటుంది.

- జానర్: యాక్షన్-అడ్వెంచర్
- మోడ్: మల్టీప్లేయర్
- ప్లాట్‌ఫామ్స్: విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, ప్లేస్టేషన్ 5



సినిమా


● రవితేజ

దొంగ... పోలీస్

హీరో రవితేజ మరోసారి దొంగ పాత్రలో కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. 'దొంగోడు' మూవీలో దొంగగా, 'విక్రమార్కుడు' సినిమాలో దొంగ.. పోలీస్‌గా నటించారు రవితేజ. అలాగే 'కిక్, దొంగల ముఠా, దరువు, కిలాడి, టైగర్ నాగేశ్వరరావు' లాంటి సినిమాల్లో చోరుడి పాత్రలు చేసి, ప్రేక్షకుల్ని అలరించారాయన. తాజాగా మరోసారి దోచుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారట. ప్రస్తుతం హరీష్ శంకర్ దర్శకత్వంలో 'మిస్టర్ బచ్చన్' అనే సినిమా చేస్తున్నారు రవితేజ. ఆ తర్వాత 'జాతి రత్నాలు' ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారట. రవితేజ-అనుదీప్ కాంబినేషన్‌పై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన రాకున్నా కొన్నాళ్లుగా ఈ కాంబినేషన్‌పై వార్తలు వస్తున్నాయి. వీరి కలయికలో రానున్న సినిమాలో రవితేజ దొంగ.. పోలీస్‌గా కనిపిస్తారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. రవితేజ కామెడీ టైమింగ్‌ని దృష్టిలో పెట్టుకుని తనదైన శైలిలో ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ కథని సిద్ధం చేశారట అనుదీప్.

ప్రభాస్ 'కల్కి' యానిమేషన్ చేస్తున్నాం

– నిర్మాత రాజీవ్ చిలక



"సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం సంపాదించడం సులభమే. కానీ, పెళ్లి కుదరడం అనేది పెద్ద సమస్యగా మారింది. పైగా వివాహమనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. అందుకే 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా కథని పెళ్లి నేపథ్యంలో ఎంచుకున్నాం. ఈ కథలోని వినోదం, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఉంటాయి" అని నిర్మాత రాజీవ్ చిలక అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. రాజీవ్ చిలక నిర్మించిన ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. రాజీవ్ చిలక మాట్లాడుతూ– "ఓ యానిమేషన్ సంస్థని స్థాపించి, 'ఛోటా భీమ్' వంటి దాదాపు ఆరు యానిమేషన్ చిత్రాలు చేశాం. మల్లి చెప్పిన 'ఆ ఒక్కటీ అడక్కు' కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మించాం. నరేశ్‌గారికి కూడా ఈ కథ బాగా నచ్చింది. నరేశ్‌గారి హైట్‌ని మ్యాచ్ చేయడానికి ఫరియా అయితే బావుంటుందనిపించింది. కథ వినగానే ఆమె ఒప్పుకున్నారు. అలాగే జానీ లీవర్‌గారి అమ్మాయి జెమి లీవర్ కీలక పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభాస్‌గారి 'కల్కి 2898 ఏడీ' సినిమా యానిమేషన్ పనులు మా సంస్థలో చేస్తున్నాం. ఈ మూవీ లోని పాత్రలను వివరించే ఈ యానిమేషన్ సినిమాకంటే ముందే విడుదలవుతుంది. అలాగే పిల్లలతో 'ఛోటా భీమ్'ని చేయబోతున్నాం. అదే విధంగా డిస్నీలో మే 6న ఒక యానిమేషన్ షో లాంచ్ చేయబోతున్నాం" అన్నారు.

Konni జంటలు 'హిట్' అవుతాయి. వెండితెరపై హిట్ అయిన ఆ జోడీలను మళ్లీ మళ్లీ చూడాలని ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, మళ్లీ ఆ జోడీకి తగ్గ కథ కుదరాలి, కథ కుదిరితే ఇద్దరి డేట్స్ సెట్ అవ్వాలి. ఈ రెండూ సెట్ అయి, వెంటనే రిపీట్ అయిన జోడీలు ఉంటాయి.. ఎన్నో ఏళ్లకు గానీ రిపీట్ అయ్యే జోడీలూ ఉంటాయి. అలా కొన్నేళ్ల తర్వాత రిపీట్ అవుతున్న జోడీల గురించి తెలుసుకుందాం.

జోడీ రిటర్న్స్


● చిరంజీవి, త్రిష


● శోభన, మోహన్‌లాల్


● అర్చన, రాజేంద్రప్రసాద్, ఆకాంక్ష, రూపేష్

విశ్వంభర పిలిచాడు

దాదాపు పద్దెనిమిదేళ్ల తర్వాత హీరో హీరోయిన్లుగా స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు చిరంజీవి, త్రిష. ఈ ఇద్దరూ కలిసి నటించిన తొలి సినిమా 'స్టాలిన్' 2006లో విడుదలైంది. ఆ తర్వాత మళ్లీ చిరంజీవి, త్రిష కలిసి నటిస్తున్న సినిమా 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తున్నారని, సిస్టర్ సెంటిమెంట్‌తో పాటు ఫ్యాంటసీ ఎలిమెంట్స్ కూడా ఈ కథలో ఉంటాయని ఫిల్మ్ నగర్ సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ షెడ్యూల్‌లో ఇంట్రవెల్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 2025 జనవరి 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త.

షష్ఠిపూర్తి సంబరం

రాజేంద్రప్రసాద్-అర్చన కలిసి నటించిన 'లేడీస్ టైలర్' చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. 1986లో విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన కలిసి మళ్లీ వెంటనే మరో సినిమా చేయలేదు. 38 ఏళ్ల తర్వాత ఇప్పుడు 'షష్ఠిపూర్తి' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్షా సింగ్ లీడ్ రోల్స్‌లో, 'కాంతార' ఫేమ్ అచ్యుత్ కుమార్, శకుంతల కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కుటుంబ కథా చిత్రానికి ఇళయరాజా స్వరకర్త. అప్పటి 'లేడీస్ టైలర్' సినిమాకు సంగీతం అందించిన ఇళయరాజాయే ఈ 'షష్ఠిపూర్తి' సినిమాకూ స్వరాలు సమకూర్చడం విశేషం. కుటుంబ విలువలు, కుటుంబ సభ్యుల అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపేష్ నిర్మిస్తున్నారు.

తెరపై యాభైఆరోసారి...

మలయాళ సిల్వర్ స్క్రీన్‌పై మోహన్‌లాల్, శోభనల జోడీ సూపర్ హిట్. 'అవిడతే పోలే ఇవిడెయుమ్' (1985) సినిమా కోసం తొలిసారి మోహన్‌లాల్, శోభన జత కట్టారు. ఆ తర్వాత 'మణిచిత్ర తాళు', 'నాడోడిక్కట్టు' వంటి హిట్ సినిమాలతో పాటు యాభైసార్లకు పైగా స్క్రీన్ షేర్ చేసుకున్నారు మోహన్‌లాల్, శోభన. అయితే 1994లో విడుదలైన మలయాళ చిత్రం 'తేన్మావిన్ కొంబాట్' తర్వాత మరోసారి మోహన్‌లాల్, శోభన కలిసి లీడ్ రోల్స్‌లో నటించలేదు. ప్రస్తుతం మోహన్‌లాల్ హీరోగా నటించనున్న 360వ చిత్రంలో శోభన ఓ లీడ్ రోల్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది మోహన్‌లాల్, శోభన కలిసి నటిస్తున్న 56వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో మోహన్‌లాల్‌కు జోడీగా కనిపిస్తారట శోభన. తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఎమ్. రంజిత్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల మొదలైంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ ట్యాక్సీ డ్రైవర్‌గా కనిపిస్తారని టాక్. ఈ ఏడాది ఓనమ్‌కు సినిమాను రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్.


● జ్యోతిక, సూర్య

పెళ్లి తర్వాత తొలి సినిమా?

దాదాపు పాతికేళ్ల క్రితం తమిళ చిత్రం 'పూవెల్లామ్ కేట్టుప్పార్' (1999)లో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై జోడీగా కనిపించారు సూర్య, జ్యోతిక. ఆ తర్వాత 'ఉయిరిలే కలందదు, పేరళగన్, కాక్క కక్క, మాయావి' వంటి సినిమాల్లో సూర్య, జ్యోతిక హిట్ జోడీ అనిపించు కున్నారు. చివరిసారిగా 2006లో 'సిల్లున్ను ఒరు కాదల్' సినిమాలో సూర్య-జ్యోతిక జోడీగా కనిపించారు. ఈ సినిమా విడుదలైన తర్వాత సూర్య, జ్యోతిక రియల్ లైఫ్ జోడీ కూడా అయ్యారు. అయితే 'సిల్లున్ను ఒరు కాదల్' తర్వాత సూర్య, జ్యోతిక కలిసి సినిమా చేయలేదు. పద్దెనిమిదేళ్ల తర్వాత ఆ సమయం ఆసన్నమైందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 'కేరళ కేఫ్', 'బెంగళూరు డేస్' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అంజలీ మీనన్ ఓ కథ సిద్ధం చేశారని, ఈ కథతో తెరకెక్కనున్న సినిమాలో సూర్య, జ్యోతిక జోడీగా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఈ సినిమా ఓకే అయితే పెళ్లి తర్వాత సూర్య, జ్యోతిక కలిసి నటించే చిత్రం ఇదే అవుతుంది.

ఇంకా మరికొందరి హీరో హీరోయిన్ జోడీలు రిపీట్ అయ్యే చాన్సెస్ ఉన్నాయని తెలుస్తోంది.


● అమీ ఆడమ్స్

పునరావాసం తర్వాత...

సమాజంలో పేరు, ప్రఖ్యాతులు కలిగిన ఓ మహిళ సుదీర్ఘమైన పునరావాసాన్ని గడపాల్సి వస్తుంది. ఈ పునరావాసం తర్వాత ఆ మహిళ తిరిగి ఏ విధంగా తన కొత్త జీవితాన్ని ఆరంభించింది? సమాజంలో పాపులర్ అయిన ఆ మహిళ ఎందుకు పునరావాస కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది? తిరిగి వచ్చిన తర్వాత తన కుటుంబంతో ఏ విధంగా తన జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చింది? అనే అంశాల సమాహారంగా రూపొందనున్న హాలీవుడ్ చిత్రం 'ఎట్ ది సి'. ఆరుసార్లు ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న అమీ ఆడమ్స్ ఈ సినిమాలో లీడ్ రోల్‌లో నటించనున్నారు. 'వైట్ గాడ్', 'పీసెస్ ఆఫ్ ఎ ఉమెన్' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన కార్నెల్ ముంద్రుక్జో 'ఎట్ ది సి' సినిమాకు దర్శకత్వం వహిస్తారు. జూన్‌లో ఈ సినిమా చిత్రీకరణ బూస్టన్ లొకేషన్స్‌లో ప్రారంభం కానుంది.

మైథలాజికల్ సహ్యా

"'సహ్యా' సినిమా టైటిల్ బాగుంది. మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. కొత్త కథాంశంతో వస్తున్న ఫీమేల్ లీడ్ సినిమాలు బాగా సక్సెస్ అవుతున్నాయి. అదే కోవలో రూపొందుతున్న 'సహ్యా' చిత్రం మంచి విజయం సాధించాలి" అని నటుడు అర్జున్ అన్నారు. మౌనికా రెడ్డి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'సహ్యా'. యాస రాకేష్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ సుధాకర్ జూకంటి, భాస్కర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను అర్జున్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– "వైవిధ్యమైన కథాంశంతో మైథలాజికల్ మూవీగా రూపొందుతోన్న చిత్రం 'సహ్యా'. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తాం" అన్నారు. సుమన్, సంజయ్ కృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ కోలుగురి, సంగీతం: రోహిత్ జిల్లా.


● మౌనికా రెడ్డి


సాక్షి జాతీయం
ఎలక్షన్ 2024
శుక్రవారం ఏప్రిల్, 26

తొమ్మిదేళ్లయినా చెరగని సిరా గుర్తు!

ఓటేసినప్పుడు వేలిపై పెట్టే ఇంకు గుర్తు ఎన్ని రోజులుంటుంది? వారం. నెల. మహా అయితే రెండు మూడు నెలలు. కానీ కేరళకు చెందిన ఉష అనే ఓటరును మాత్రం తొమ్మిదేళ్లయినా సిరా గుర్తు వదలడం లేదు. ఆమెకు ఇదో పెద్ద తలనొప్పిగా కూడా మారింది!

షోరన్పూర్‌లోని గురువాయూరప్పన్ నగర్‌లో ఉండే 62 ఏళ్ల ఉష 2016లో ఓటేసింది. ఆ సందర్భంగా వేలిపై వేసిన ఇంకు గుర్తు 9 ఏళ్లయినా మాసిపోలేదు. అనేక రకాల సబ్బులు, ద్రావణాలతో కడిగినా లాభం లేకపోయింది. ఆ తర్వాతి స్థానిక ఎన్నికల్లో ఓటేయడానికి వెళ్తే వేలిపై గుర్తు చూసి 'సువ్విప్పటికే ఓటేశావు పొ'మ్మన్నారట ఎన్నికల అధికారులు! పోలింగ్ బూత్‌లోని ఏజెంట్లు అసలు విషయం చెప్పడంతో చివరికి ఓటేయడానికి అనుమతించారు. పోలింగ్ బూత్‌ల్లో ఎందుకీ గోల అని 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఉష ఓటే వేయలేదు! ఈసారీ అదే సమస్య ఎదురవుతుందేమోనని భయపడుతున్నారు. ప్రచారానికి వచ్చిన ఓ నాయకునికి విషయం చెప్పడంతో ఆయన ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని వాళ్లు హామీ ఇచ్చారట. ఎన్నికల సిరా గుర్తు ఇంతకాలం పాటు చెరగకుండా ఉన్న ఘటనలు ఎక్కడా లేవని వారు విస్తుపోతున్నారు! అయితే ఇలా జరిగేందుకు అవకాశం ఉందని చర్మ వ్యాధి నిపుణులు అంటున్నారు. ''సిరా చుక్క గోళ్ల కింద చేరితే మచ్చ అలాగే ఉండే చాన్సుంది. సమగ్ర వైద్య పరీక్షలు చేస్తే కారణం తెలుస్తుంది'' అని చెబుతున్నారు.





కాంగ్రెస్, బీజేపీ కూటమి హోరాహోరీ

14 లోక్‌సభ స్థానాలకు నేడే పోలింగ్ • వీటిలో 11 బీజేపీ సిట్టింగ్ స్థానాలే

• కన్నడిగుల తొలి ఓటెవరికో!

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నాటకలో 14 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం రెండో విడతలో పోలింగ్ జరగనుంది. 2019లో రాష్ట్రంలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా ఈసారి బీజేపీ-జేడీ(ఎస్) కూటమితో కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతోంది. జేడీ(ఎస్) పోటీ చేస్తున్న హసన్, మండ్య, కోలార్ స్థానాలకు రెండో విడతలోనే పోలింగ్ ముగియనుంది. ఆ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టు కట్టడం విశేషం! ఈసారి పలు స్థానాల్లో పోటీ నువ్వా నేనా అన్నట్టుగా సాగుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

బెంగళూరు రూరల్

2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానమిది. ఈసారి కూడా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2009లో జేడీ(ఎస్) నేత కుమారస్వామి గెలిచారు. కాంగ్రెస్ ఇక్కడ బలంగా ఉండటంతో దేవెగౌడ అల్లుడు, ప్రముఖ వైద్యుడు సి.ఎన్.మంజునాథను బీజేపీ బరిలో దింపింది. ఇద్దరూ బలమైన అభ్యర్థులు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. చారిత్రకంగా ఇక్కడ హస్తానిదే ఆధిపత్యం. ఆ పార్టీ ఏకంగా 13 సార్లు నెగ్గగా మూడు సార్లు జేడీ(ఎస్) గెలిచింది.

బెంగళూరు నార్త్

బీజేపీ నేత సదానంద గౌడ 2014 నుంచీ ఇక్కడ గెలుస్తున్నారు. ఈసారి మాత్రం కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజె పోటీ చేస్తున్నారు. ప్రముఖ విద్యావేత్త, కాంగ్రెస్ నేత ఎంపీ రాజీవ్‌గౌడను ఆమె ఢీకొడుతున్నారు. గౌడ బెంగళూరు ఐఐఎం ప్రొఫెసర్. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ సభ్యుడు. ఈ స్థానం 1999 దాకా కాంగ్రెస్ కంచుకోట. 2004 నుంచీ బీజేపీ జైత్రయాత్ర సాగుతోంది. దీనికి ఈసారి ఎలాగైనా చెక్ పెట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.



కోలార్

ఒకప్పుడు కాంగ్రెస్‌కు బలమైన పట్టున్న కోలార్‌లో ఈసారి గట్టి పోటీ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇక్కడ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేత ఎస్.మునిస్వామి 2.1 లక్షల మెజారిటీతో కాంగ్రెస్ నేత కె.హెచ్.మునియప్పపై నెగ్గారు. ఈసారి పొత్తులో భాగంగా జేడీ(ఎస్) అభ్యర్థి ఎం.మల్లేశ్‌బాబు పోటీ చేస్తున్నారు. అంతర్గత విభేదాలు కూడా ఇక్కడ కాంగ్రెస్‌కు చేటు చేసేలా ఉన్నాయి. ఇక్కడ ఆరుసార్లు గెలిచిన మునియప్ప ఇటీవలి అసెంబ్లీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. లోక్‌సభ టికెట్‌ను తన అల్లుడికి ఇప్పించుకునేందుకు ప్రయత్నించగా సొంత పార్టీ నేతలే మోకాలడ్డారు.

బెంగళూరు సౌత్

1996 నుంచి ఈ స్థానం బీజేపీకి కంచుకోట. బీజేపీ దివంగత నేత అనంతకుమార్ ఇక్కడినుంచి ఏకంగా 28 ఏళ్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు! 2019 ఎన్నికల్లో యువ నేత తేజస్వి సూర్య బీజేపీ తరఫున 3.31 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఈసారీ ఆయనకే బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యా రెడ్డి బరిలో ఉన్నారు. ఈసారీ విజయం తనదేనని తేజస్వి ధీమాగా ఉన్నా పోరు హోరాహోరీగా సాగవచ్చంటున్నారు.

మండ్య

వొక్కళిగ ఆధిపత్యమున్న స్థానమిది. గత ఎన్నికల్లో నటి సుమలత బీజేపీ మద్దతుతో 1.26 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మాజీ సీఎం కుమారస్వామి కుమారుడు నిఖిల్ కుమారస్వామిని ఓడించారు. ఈ స్థానం పొత్తులో భాగంగా ఈసారి జేడీ(ఎస్)కు వెళ్లింది. కుమారస్వామే బరిలో ఉన్నారు. సుమలత బీజేపీలో చేరడం ఆయనకు మరింత కలిసిరానుంది. కాంగ్రెస్ నుంచి వెంకటరమణ గౌడ (స్టార్ చంద్రు) బరిలో ఉన్నారు. 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి జేడీ(ఎస్) విజయం సాధించడం కూడా కుమారస్వామికి కలిసొచ్చే అంశాల్లో ఒకటి.

సామాజిక వర్గాల ప్రభావం..

రెండో దశలో భాగంగా ఎన్నికలు నిర్వహించే 14 స్థానాలకు గాను మెజారిటీ చోట్ల వొక్కళిగ సామాజిక వర్గం ఓటర్లు కీలకంగా వ్యవహరించనున్నారు. వీరు బీజేపీ వైపు మొగ్గు చూపిస్తుంటారు. వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనా బీజేపీ దృష్టి సారించింది. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం ఓటర్లను ఆకర్షించడంపై కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి పెట్టింది.

హసన్

మాజీ ప్రధాని దేవెగౌడ ఐదుసార్లు నెగ్గిన స్థానమిది. 2019లో మనవడు ప్రజ్వల్ రేవణ్ణను బరిలో దింపారు. బీజేపీ నేత ఎ.మంజుపై ఆయన 1.41 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఈసారి కూడా జేడీ(ఎస్) నుంచి ప్రజ్వలే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన నేతగా పేరున్న జి.పుట్టస్వామి గౌడ మనవడు శ్రేయస్ పటేల్ పోటీలో ఉన్నారు. ఒకప్పుడు దేవెగౌడ, పుట్టస్వామి పోటీకి వేదికైన హసన్ వారి మనవళ్ల పోరుకు కేంద్రంగా మారింది!

కరవు కోరలు

కర్ణాటకలోని అధిక ప్రాంతాలు ప్రస్తుతం చరిత్రలోనే అతి తీవ్రమైన కరువును చూస్తున్నాయి. దాదాపు అధిక శాతం పట్టణాలను కరువు ప్రాంతాలుగా ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. ఫలితంగా నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. కరువు కోరల్లోనే జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారంటీలతో నెగ్గుకొచ్చిన కాంగ్రెస్‌కు.. లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆ గ్యారంటీల ప్రభావం ఇప్పుడు అంతగా పనిచేయకపోవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది.

నాలెడ్జ్ కేపిటల్. ఐటీ హబ్. దిగ్గజ శాస్త్ర సాంకేతిక సంస్థల నిలయం. కాస్మోపాలిటన్ సంస్కృతి. చెప్పుకుంటూ పోతే బెంగళూరు నగర ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. కానీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ లెక్కలన్నింటినీ పక్కన పెట్టేస్తున్నారు నగర ఓటర్లు. అన్నిచోట్లా ఉన్నట్టే కులం, మతం, పార్టీ విధేయతలకే ఓటేస్తున్నారు! బెంగళూరు నగర పరిధిలో 4 లోక్‌సభ సీట్లకూ శుక్రవారం రెండో విడతలో పోలింగ్ జరగనుంది. 2008లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పటి నుంచీ ఆ స్థానాల్లో ఓటర్లు ఎప్పుడూ ఒకే పార్టీకో, అభ్యర్థికో పట్టం కడుతుండటం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్

బెంగళూరు పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన అభ్యర్థే గెలవడం, ఒకే పార్టీకి ఓటర్లు జై కొట్టడానికి నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తీరే కారణమనేది రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. నేతలు తమకు అనుకూలమైన కులాలు, మతాల ఓటర్లు ఒకే నియోజకవర్గంలోకి వచ్చేలా జాగ్రత్త పడటం వల్లే ఈ ట్రెండ్ కొనసాగుతోందనే వాదనలు బలంగా ఉన్నాయి. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే ధోరణి ప్రతిఫలిస్తోంది. 2008 నుంచి బెంగళూరులోని మొత్తం 28 అసెంబ్లీ స్థానాల్లో 57 శాతం సీట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలే గెలుస్తూ వస్తున్నారు. మరో 18 శాతం సీట్లను ఒకే ఎమ్మెల్యే లేదా పార్టీ కనీసం రెండుసార్లు గెలవడం విశేషం. ఆ లెక్కన చూస్తే నగరంలోని 75 శాతం స్థానాలు ఒకే అభ్యర్థికో, ఒకే పార్టీకో 'రిజర్వ్' అయిపోయాయన్నమాట! రాజకీయాల్లో తరచూ వినిపించే ఓటర్ల వ్యతిరేకత, సిట్టింగ్ ప్రజాప్రతినిధిపై అసంతృప్తి వంటివి బెంగళూరుకు వర్తించవు! నగర పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లలో బీజేపీ నుంచి, ఏడు స్థానాల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన అభ్యర్థులే మళ్లీ గెలిచారు. శివాజీనగర్‌లో 2008 నుంచి వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యే అయిన రోషన్ బేగ్ 2019లో బీజేపీలోకి దూకారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ అర్షద్ చేతిలో ఆయన చిత్తుగా ఓడటం విశేషం! అర్షద్‌కు ఎమ్మెల్యేగా అది రెండో విజయం. చామరాజ్‌పేట్ నుంచి మూడుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ మాత్రం రెండుసార్లు జేడీ(ఎస్) టికెట్‌పైనా గెలిచారు.

బెంగళూరు సిటీ... రిజర్వ్‌డ్!

అదే పార్టీ, వారే అభ్యర్థులు

- పునర్విభజన నుంచీ ఇదే ట్రెండ్
- కాస్మోపాలిటన్ సిటీలో కులాధిపత్యం



బెంగళూరు ఎయిర్‌పోర్టు

వొక్కళిగలే కీలకం...

బెంగళూరులో ఇలా ఒకే పార్టీ, ఒకే అభ్యర్థి వరుసగా గెలుస్తున్న ట్రెండ్ వెనక పలు ఇతర కారణాలూ ఉన్నా కులమే కీలక ఫ్యాక్టర్‌గా నిలుస్తోంది. పార్టీ ఓటు బ్యాంకుతో పాటు పార్టీలు, నేతల మధ్య లోపాయకారీ అవగాహన, తటస్థ ఓటర్ల మొగ్గు కూడా ప్రభావం చూపుతున్నాయి.

- బెంగళూరులోని 28 అసెంబ్లీ స్థానాల్లో 4 ఎస్సీ రిజర్వుడు సీట్లు. వాటిని బీజేపీ, కాంగ్రెస్ చెరో రెండు చొప్పున తమ ఖాతాలో వేసుకుంటూ వస్తున్నాయి.
- బెంగళూరు పరిధిలోని 28 మంది ఎమ్మెల్యేల్లో 13 మంది వొక్కళిగ కులానికి చెందినవారే. మిగతా సీట్లలో కూడా వారి ప్రభావం గట్టిగా కనబడుతుండటం నగరంలో కులాలవారీ ఓటింగ్ కీలకంగా నిలుస్తోందనేందుకు తిరుగులేని నిదర్శనం.
- పునర్విభజన తర్వాత పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి బెంగళూరు నగర పరిధిలోని నియోజకవర్గాలకు ఓటర్ల వలస కూడా ఈ ధోరణికి మరింత దోహదపడుతోంది.
- వొక్కళిగ, ఎస్సీ రిజర్వుడ్‌తో పాటు ముగ్గురు ముస్లిం, ఒక క్రిస్టియన్ అభ్యర్థులు శివాజీనగర్ శాంతిగనర్, చామరాజ్‌పేట్, సర్వజ్ఞనగర్‌లో అసెంబ్లీ స్థానాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు.
- రాజాజీనగర్, గాంధీగనర్, బసవనగుడి, చిక్పేట్ నియోజవర్గాల్లో ఎప్పుడూ బ్రాహ్మణ సామాజిక వర్గమే గెలుస్తోంది.
- ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నగరంలో టికెట్ల కేటాయింపులోనూ వొక్కళిగల ఆధిపత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నాలుగు సీట్లలో మూడింటిని కాంగ్రెస్ ఆ సామాజికవర్గానికే కట్టబెట్టింది. బెంగళూరు నార్త్ నుంచి రాజీవ్ గౌడ, సౌత్ నుంచి సౌమ్యా రెడ్డి, రూరల్‌లో డీకే సురేశ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి బెంగళూరు నార్త్ అభ్యర్థి శోభ కరంద్లాజె, రూరల్ నుంచి సీఎన్ మంజునాథ కూడా వొక్కళిగలే.
- బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో చాలావరకు మైనారిటీల ఆధిపత్యమే కావడంతో మన్సూర్ అలీకి కాంగ్రెస్ టికెటిచ్చింది.

బెంగళూరు నగర పరిధిలోని లోక్‌సభ స్థానాలు

బెంగళూరు నార్త్, బెంగళూరు రూరల్, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు సౌత్

లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే ధోరణి

- నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ బెంగళూరు పరిధిలోని స్థానాల్లో దాదాపు ఒకే పార్టీ, లేదా అభ్యర్థే గెలిచారు.
- బెంగళూరు రూరల్ 2013 ఉపఎన్నిక నుంచీ కాంగ్రెస్ కంచుకోటగా మారింది. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టారు. నాలుగో విజయం కోసం మళ్లీ బరిలో దిగారు. ఆయనదీ వొక్కళిగ కులమే. ఇక్కడ బీజేపీ కూడా అదే సామాజిక వర్గానికి చెందిన దేవెగౌడ అల్లుడు సి.ఎన్.మంజునాథను బరిలో దింపింది.
- బెంగళూరు సెంట్రల్ బీజేపీ సిట్టింగ్ ఎంపీ పీసీ మోహన్ కూడా హ్యాట్రిక్ వీరుడే. ఈసారి కూడా ఆయనే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని మార్చి మన్సూర్ అలీతో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది.
- బెంగళూరు సౌత్ నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ తేజస్వీ సూర్య మళ్లీ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1991 నుంచీ కాషాయ జెండానే ఎగురుతుండటం విశేషం! దాంతో ఈసారి రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యా రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపింది.
- బెంగళూరు నార్త్‌లో మాత్రం 2014 నుంచీ గెలుస్తున్న సదానంద గౌడను బీజేపీ ఈసారి పక్కనబెట్టింది. ఉడుపి-చిక్‌మగళూరు ఎంపీ, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజెను బరిలో దింపింది. ఆమె కోస్తా వొక్కళిగ కాగా కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్ గౌడ స్థానిక వొక్కలిగ కావడం విశేషం.

నోట్ 'గతం' శీర్షికన అందిస్తున్న లోక్‌సభ ఎన్నికల సిరీస్‌కు రెండో విడత పోలింగ్ కవరేజీ కారణంగా ఈ రోజు విరామం. ఆ సిరీస్ రేపటినుంచి యథావిధిగా కొనసాగుతుంది.

హస్తానికి అందని ద్రాక్షేనా!

మధ్యప్రదేశ్‌లో ఆరు సీట్లకు నేడే పోలింగ్

రెండు దశాబ్దాలుగా కాషాయ జెండానే • యువ అభ్యర్థులతో కాంగ్రెస్ ప్రయోగం



హిందీ బెల్టులో కీలక రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. 2009లో 12 స్థానాల్లో గెలిచిన హస్తం పార్టీ 2014లో 2 స్థానాలకు పడిపోయింది. 2019కి వచ్చేసరికి ఒకే సీటుకు పరిమితమైంది. మిగతా 28 చోట్లా కాషాయ జెండాయే ఎగిరింది! గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ దుమ్ము రేపింది. శుక్రవారం రెండో విడతలో రాష్ట్రంలో ఆరు కీలక స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇవన్నీ బీజేపీ కంచుకోటలే. ఇక్కడ బీజేపీని ఎదుర్కోలేక రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ అష్టకష్టాలు పడుతోంది. ఆ స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థులు, వారి బలాబలాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఖజురహో... కాంగ్రెస్ సెల్ఫ్ గోల్

బలమైన బీజేపీని దీటుగా ఢీకొట్టాల్సిన వేళ హస్తం పార్టీ ఆదిలోనే 'చేయి' కాల్చుకుంది. పోలింగ్‌కు ముందే ఈ స్థానాన్ని చేజేతులా 'కమలం' పువ్వులో పెట్టి మరీ అందిస్తోంది. పొత్తులో భాగంగా ఖజురహోను సమాజ్‌వాదీ పార్టీకి కాంగ్రెస్ త్యాగం చేసింది. ఇక్కడ బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపీ వీడీ శర్మపై అనామకుడైన మనోజ్ యాదవ్‌ను ఎస్పీ తొలుత అభ్యర్థిగా ప్రకటించింది. తర్వాత మాజీ ఎమ్మెల్యే మీరా దీపక్ యాదవ్‌కు సీటిచ్చింది. కానీ నామినేషన్ పత్రాల్లో సంతకం మర్చిపోవడంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఈసీ తిరస్కరించింది. దాంతో కంగుతిన్న కాంగ్రెస్, ఎస్పీ పెద్దగా సోదిలో లేని ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఆర్.బి.ప్రజాపతికి మద్దతి వ్వాల్సి వస్తోంది. దీంతో ఇక్కడ విజయం బీజేపీకి నల్లేరుపై నడకే కానుంది. 2019లో 4.3 లక్షల పై చిలుకు మెజారిటీతో గెలిచిన శర్మ ఈసారి దాన్ని మరింత పెంచుకుంటారంటున్నారు. ''వీడీ శర్మ చూడ్డానికి సన్నగా కనిపించినా ఆయన నాయకత్వంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొత్త రికార్డులు కొట్టింది'' అంటూ తాజాగా దామోహ్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ ఆకాశానికెత్తారు.

హోషంగాబాద్.. కుబేరుడితో సరస్వతీ పుత్రుడు ఢీ!

ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఉదయ్ ప్రతాప్ సింగ్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. దాంతో ఈసారి ఐదు మాస్టర్ డిగ్రీల వీరుడు, రైతు ఉద్యమకారుడు దర్శన్ సింగ్ చౌదరిని బీజేపీ బరిలో దింపింది. నెరిసిన గడ్డం, తెల్లటి తలపాగాతో సౌమ్యంగా కనిపించే ఈయన సరస్వతీ పుత్రుడు. ఫిలాసఫీ, ఇంగ్లిష్, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, సోషియాలజీల్లో ఎంఏ చేశారు. నర్మదా లోయలో పలు రైతు ఉద్యమాలకు సారథ్యం వహించారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు కొత్తే అయినా బాగా గుర్తింపున్న నాయకుడు. కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శర్మ రాష్ట్రంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తి రూ.233 కోట్లు. హోషంగాబాద్ నియోజకవర్గ పరిధిలోని తెండుఖేడా అసెంబ్లీ స్థానం నుంచి రెండుసార్లు గెలిచారు. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడారు.

తికంగఢ్... యమా టఫ్

2009లో ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారినప్పటి నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. ఇక్కడ బీజేపీ హ్యాట్రిక్ వీరుడు, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ఖటిక్ మళ్లీ బరిలో ఉన్నారు. గతంలో సాగర్ లోక్‌సభ స్థానంలోనూ నాలుగుసార్లు గెలిచిన రికార్డు ఆయనది. 2009లో తికంగఢ్ స్థానం ఏర్పడ్డప్పటి నుంచీ ఆయనే గెలుస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ ఇక్కడ ప్రతిసారీ అభ్యర్థులను మార్చినా ఫలితం మాత్రం శూన్యం. వీరేంద్ర అంతకంతకూ మెజారిటీ పెంచుకుంటూ పోతున్నారు. ఈసారి పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ అహిర్వార్ రూపంలో యువ నేతను కాంగ్రెస్ బరిలోకి దించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జతారా స్థానం నుంచి టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన తిరుగుబావుటా ఎగరేశారు. దాంతో ఇలా ఎంపీ టికెటిచ్చింది. బాహుబలి వంటి కేంద్ర మంత్రి వీరేంద్రపై పోటీకి నిలపడం పంకజ్‌ను బలిపశువును చేయడమేనని కాంగ్రెస్ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు!

దామోహ్.. లోధీ వర్సెస్ లోధీ

బడా నేతలెవరూ రేసులో లేకున్నా ఆసక్తి రేపుతున్న నియోజకవర్గమిది. బీజేపీ అభ్యర్థి రాహుల్ సింగ్ లోధీ, కాంగ్రెస్ అభ్యర్థి తర్బార్‌సింగ్ లోధీ ఇద్దరూ ఒకప్పుడు బీజేపీ ఫైర్ బ్రాండ్ ఉమా భారతి వీరవిధేయులే! పైగా బంధువులు కూడా. 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇద్దరూ బీజేపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. దామోహ్ నుంచి రాహుల్, బాందా నుంచి తర్బార్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. 15 నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడంతో రాహుల్ మళ్లీ బీజేపీ పంచన చేరారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య పోటీ హోరాహోరీగానే ఉండొచ్చనేది పరిశీలకుల అభిప్రాయం. ఇక్కడ రెండుసార్లు నెగ్గిన సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్ర మంత్రి అయ్యారు.

సత్నా.. హోరాహోరీ

నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ బలశాలి గణేశ్ సింగ్‌పై యువ ఎమ్మెల్యే సిద్దార్థ్ కుశ్వాహను కాంగ్రెస్ బరిలో నిలిపింది. ఐదు నెలల క్రితమే సత్నా అసెంబ్లీ స్థానంలో గణేశ్ సింగ్‌ను కుశ్వాహ మట్టికరిపించడం విశేషం! దాంతో ఈసారి వారిద్దరి పోటీ ఉత్కంఠ రేపుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి షాకిచ్చిన చరిత్ర కుశ్వాహది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బీజేపీ నేత శంకర్‌లాల్ తివారీని ఓడించి జెయింట్ కిల్లర్‌గా పేరొందారు.

రేవా.. కమలానికే మొగ్గు

బ్రాహ్మణ ఓట్లు ఎక్కువగా ఉన్న ఈ స్థానంలో ఇరు పార్టీలూ ఆ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులనే నిలబెడుతూ వస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీ జనార్దన్ మిశ్రాకే బీజేపీ మళ్లీ టికెటిచ్చింది. ఇక్కడ 2014లో 1.68 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గిన మిశ్రా 2019లో దాన్ని 3.12 లక్షలకు పెంచుకున్నారు. ప్రతిసారీ అభ్యర్థులను మారుస్తున్న కాంగ్రెస్ ఈసారి మహిళకు టిక్కెట్ ఇచ్చింది. రేవా మేయర్ అభయ్ మిశ్రా భార్య నీలంను రంగంలోకి దించింది. అయితే ఈ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏడు బీజేపీ గుప్పిట్లోనే ఉన్నాయి. ఈసారీ ఆ పార్టీకే విజయావకాశాలు కనిపిస్తున్నాయి.